ప్రజాశక్తి

గురువారం 7 నవంబర్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఇంకానా? పంచ గ్రామాలపై వంచన

- భూమికి భూమి కావాలంటూ దేవాదాయ శాఖ మళ్లీ సర్వేలు
- ఐదుగురు ఎమ్మెల్యేలూ కూటమి పార్టీ నేతలే
- గత సర్కారు ఇచ్చిన 'రిపేర్ల' ఉత్తర్వు మళ్లీ తెరపైకి తెచ్చిన ప్రభుత్వం



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రిపేర్లు చేసుకునే ఉత్తర్వులు కాకుండా శాశ్వత పరిష్కారం కావాలంటూ ఏళ్లుగా డిమాండ్ చేస్తున్న 'పంచగ్రామాల' రైతులు, ప్రజల నెత్తిన మళ్లీ ఆ పాత ఉత్తర్వునే కొత్త 'కూటమి' ప్రభుత్వం తెచ్చి పెట్టింది. దీంతో గ్రామాల్లో ఈ ఉత్తర్వులపై ప్రజానీకం మండిపడుతున్నారు. విశాఖ పరిసర ప్రాంతాల్లో 'పంచ గ్రామాల' భూ వివాదం ప్రధానమైనది. ఏళ్లతరబడి వారు కోరుతున్న ప్రకారం కుటుంబాల సంఖ్య, జనాభా పెరిగిపోవడం 30ఏళ్ల క్రితం నిర్మించుకున్న చిన్న చిన్న ఇళ్లలో జీవించడం ఇంకా కష్టమని, అదనపు నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. గత వైసిపి ప్రభుత్వం 2023 నవంబరు 11న విడుదల చేసిన ఇళ్లు రిపేర్లకు ఇచ్చిన మెమో ఆర్‌సి నెం.11/18023(32)5/2023ను పంచ గ్రామాల్లో సింహాచలం దేవస్థానం అధికారులు తాజాగా ప్రచారంలో పెట్టారు. దీంతో ఈ గ్రామాల పరిధిలో రైతులు, ప్రజలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు.

ఆ ఎమ్మెల్యేలంతా బాధ్యులే... బాధ్యత ఎవరిది?

రిపేర్లతో ఏం ఒరుగుతుంది? అంటూ స్థానిక ప్రజలు తాజాగా ప్రశ్నిస్తున్నారు. ఈ పంచ గ్రామాలూ విశాఖ జిల్లాలోగల 5 అసెంబ్లీ సెగ్మెంట్ల (తూర్పు, పశ్చిమం, ఉత్తరం, పెందుర్తి, భీమునిపట్నం) పరిధిలో కూటమి పార్టీలకు చెందిన టిడిపి -3 బిజెపి-1, జనసేన -1 ఎమ్మెల్యేలు గెలుపొందిన సెగ్మెంట్లలోకి వస్తాయి. 'అందరూ బాధ్యులే ఎవ్వరికీ బాధ్యత లేదా' అన్న రీతిలో జనం తాజాగా ఈ ఐదుగురు ఎమ్మెల్యేలను ప్రశ్నిస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు.

చినగదిలి, పెందుర్తి మండలాల్లోగల అడవివరం, వెంకటాపురం, వేపగుంట, చీమలాపల్లి, పురుషోత్తపురం (పంచగ్రామాలు) పరిధిలో సుమారు 15 జివిఎంసి వార్డులున్నాయి. సుమారు లక్ష మంది ప్రజలు, 25వేల కుటుంబాలకు చెందిన 1785 ఎకరాలను సింహాచలం దేవస్థానం క్లియర్ చేయాల్సి ఉంది. ఈ పంచగ్రామాల పరిధిలో మొత్తం భూమి 11,282 ఎకరాలు కాగా, దీంట్లో 9069 ఎకరాలు దేవాదాయ శాఖది మిగతా 1785 ఎకరాలు రైతులది. ఈ భూమిలోనే సింహాచలం పరిధిలోగల పైన తెలిపిన గ్రామాల్లో రైతులు, రైతుల వద్ద భూములు కొనుక్కుని అప్పులు చేసి ఇల్లు నిర్మాణాలు చేసుకుని ఆర్థిక భారంతో జీవిస్తున్న మధ్యతరగతి, పేద ప్రజలు పరిష్కారం కోసం నిరీక్షిస్తున్నారు.

గతంలో జరిగిందేమిటి? ఇప్పుడేం జరుగుతోంది?

2000 సంవత్సరంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం జీవో 578 తీసుకొచ్చి ఏకపక్షంగా ఈ భూమంతా సింహాచలం దేవస్థానానికి చెందుతుందని రైత్వారీ పట్టాలను స్థానిక

మిగతా 2లో..

ప్రభుత్వానికి పట్టని కార్మికుల గోడు

- అభిజిత్ యాజమాన్యంపై చర్యకు వెనకడుగు
- ఎంపీ, ఎమ్మెల్యే జోక్యమూ అంతంతే
- పరిష్కారం కాని సమస్య
- కొనసాగుతున్న ఆందోళన



అభిజిత్ గేట్ వద్ద కార్మికులతో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, రాము

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

పనులు కోల్పోయి వీధినపడ్డ వెయ్యి మంది కార్మిక కుటుంబాల సమస్య ప్రభుత్వం చెవికెక్కినట్లులేదు. భూములు కోల్పోయి, పరిశ్రమలో ఉపాధిలేక బతకడానికి దురవస్థలుపడుతున్న కార్మికులకు అండగా ఎంపీ సిఎం రమేష్, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ నిలబడ్డంలేదు. అభిజిత్ అక్రమ లే ఆఫ్‌ను ఎత్తివేసి, ఉపాధి కల్పించాలని గత నెల 14 నుంచి సిఐటియు ఆధ్వర్యాన ఆందోళన చేపడుతున్న కార్మికులకు మద్దతు తెలపడానికి కూడా వారికి నోరు రాలేదు. కార్మికుల నిరసనలో పాల్గొని సంఘీభావం ప్రకటించడానికి వారికి సమయం దొరికినట్లులేదు. యాజమాన్యంతో మాట్లాడి లే ఆఫ్ ఎత్తివేసే పని ఎమ్మెల్యే సుందరపు చేస్తారని ఆశపడ్డ కార్మికులకు నిరాశే ఎదురైంది. మంగళవారం కాంట్రాక్టర్లు, యాజమాన్య ప్రతినిధులతో మాట్లాడిన సుందరపు, బుధవారం నుంచి లే ఆఫ్ ఎత్తివేస్తారని చెప్పడంతో, ఆ మాటలు నమ్మిన కార్మికులు, మహిళలు బుధవారం ఉదయం అభిజిత్ కంపెనీలో పనుల కోసం వచ్చారు. కానీ ఎంతసేపటికీ గేట్ తీయకపోవడంతో కార్మికులు ఆందోళనకు దిగారు.

గేట్ దగ్గర పెట్టిన నోటీసు బోర్డు తొలగించలేదు. లే ఆఫ్ ఎత్తివేస్తామని తామేమీ హామీ ఇవ్వలేదని యాజమాన్య ప్రతినిధులు చెప్పడంతో ఎమ్మెల్యే అసలు రూపం బయటపడింది. తమ తరపున నిలబడి ఉపాధి కల్పించాల్సిన ఆయన తమను తప్పుదోవబట్టించారని కార్మికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అక్రమ లే ఆఫ్ ప్రకటించిన అభిజిత్ యాజమాన్యంపై విఎస్ఇజెడ్ అధికారులు వల్లమాలిన ప్రేమ కనబర్చుతున్నట్లుంది. అక్రమ లే ఆఫ్‌పై యాజమాన్యాన్ని ప్రాసిక్యూషన్ చేయాల్సిన కార్మికశాఖాధికారులు చేతులుకట్టుకున్నారు. లే ఆఫ్ ఎత్తివేసి పనులు కల్పించడానికి అవసరమైన జోక్యం చేసుకోకుండా కాలయాపన చేస్తున్నారు. కార్మిక ప్రతినిధులు, సిఐటియు నాయకులు, యాజమాన్య ప్రతినిధులతో మాట్లాడే ప్రయత్నం చేయడంలేదు. అక్రమ లే ఆఫ్ రోజు నుంచి బుధవారం

మిగతా 2లో..

నేటి నుంచి విశాఖలో ఇసికాన్ జాతీయ సదస్సు

వార్త 8లో..

అధికార లాంఛనాలతో మాజీ మంత్రి అంత్యక్రియలు

వార్త మెయిన్ 3లో..

విద్యుత్ ట్రూఅప్ ఛార్జీలు రద్దు చెయ్యాలి : వార్వా, నివాస్

వార్త 8లో..

మమ్మల్ని ఆదుకోండి

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల కుటుంబ సభ్యుల ఆందోళన

వార్త మెయిన్ 2లో..

ఇళ్ల నిర్మాణాల్లో జోరు పెంచాలి

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో మరింత పురోగతి సాధించాలని, రోజుకు 150 నిర్మాణాలు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ మీటింగు హాలులో ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఇసుక సరఫరా, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. లే-అవుట్ల వారీగా సమీక్షించిన కలెక్టర్ అక్కడ చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. నిర్దేశిత లక్ష్యాల మేరకు స్టేజ్ కన్వెర్షన్ జరగాలని, నిర్మాణాలు పూర్తి చేయాలని చెప్పారు. మండల ప్రత్యేక అధికారులు, లే-అవుట్ ఇన్‌ఛార్జి అధికారులు పనులను పర్యవేక్షించాలని, క్షేత్ర స్థాయి అధికారులకు తగిన సహకారం అందించాలని సూచించారు. లబ్ధిదారులను ప్రోత్సహిస్తూ, గుత్తేదార్లను అప్రమత్తం చేస్తూ పనుల్లో జోరు పెంచాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ ఆళ్ల శ్రీనివాసు, ఈఈలు, డీఈలు, మండల ప్రత్యేక అధికారులు, ఏఈలు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విద్యా, వసతి దీవెన బకాయిలు విడుదల చేయాలి

ప్రజాశక్తి -యంత్రాంగం

అనకాపల్లి : విద్యార్థులకు చెల్లించాల్సిన విద్యా, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు తక్షణమే విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన అనకాపల్లి నెహ్రూ చౌక్ జంక్షన్‌లో బుధవారం విద్యార్థులు పెద్ద ఎత్తున మానవహారం చేపట్టారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయానికి వెళ్లి ఆర్‌డిఒ షేక్ ఆయేషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శి ఎం.రమణ మాట్లాడుతూ, విద్యా దీవెన, వసతి దీవెన, తల్లికి వందనం అమలు చేయకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు చెల్లించకపోతే సర్టిఫికెట్లు ఇవ్వమని, సెమిస్టర్ పరీక్ష ఫీజును కట్టించుకోమంటూ విద్యార్థులను, తల్లిదండ్రులను కాలేజీ మేనేజ్‌మెంట్లు భయాందోళనకు గురి చేస్తున్నాయని తెలిపారు. ఫీజులు చెల్లించక పోవడంతో పాసైన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వలేదని, వెంటనే సర్టిఫికెట్లు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బకాయి పడ్డ నిధులు విడుదలచేయాలని కోరారు. లేకుంటే పెద్ద ఎత్తున విద్యార్థులను ఐక్యం చేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.బాలాజీ, డివిజన్ కార్యదర్శి ఎస్.నాగరమణ, నాయకులు కృపా ఆనంద్, అర్జున్ నాయుడు, తరుణ్, లక్ష్మణ్ అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థుల ఆందోళన



అనకాపల్లిలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన మానవహారం నిర్మించిన విద్యార్థులు

నర్సీపట్నం టౌన్ : విద్యా, వసతి దీవెన బకాయిలను కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నర్సీపట్నం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద విద్యార్థులు నిరసన తెలిపారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయంలో ఎఒ సూర్యనారాయణకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వం నుంచి ఫీజు బకాయిలు విడుదలచేయకపోవడంతో విద్యార్థులు కళాశాలలో ఫీజు కట్టలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఫీజులు కడితేనే హాల్ టికెట్లు ఇస్తామని అంటున్నారని, దీంతో పరీక్షలు రాయలేమోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. విద్యార్థులు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని బకాయిలు వెంటనే విడుదల చేయాలని

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఇంకానా? పంచ గ్రామాలపై వంచన...

చినగదిలి తహశీల్దార్ చేత ఇప్పించడం జరిగింది. దీంతో 1785 ఎకరాల్లో నివాసాలుంటున్న ప్రజలు సైతం దేవస్థానం దృష్టిలో ఆక్రమణ దారులుగా పేర్కొంటూ ఇల్లు కావాలంటే రూ.డబ్బులు కట్టి రెగ్యులరైజ్ చేసుకోవాలంటూ టిడిపి ప్రభుత్వం ఆ జీవోలో పేర్కొంది. దీనిపై అప్పట్లో ఈ ప్రాంత ప్రజలు తిరుగుబాటు చేయడంతో 2024లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ జీవోను రద్దుచేసింది. సమస్య మాత్రం యథాతథంగా కొనసాగుతోంది. రైతు సంఘాలు ఈ సమస్య పరిష్కారం కోసం హైకోర్టులో కేసులు వేశాయి. దీని ప్రకారం విశాఖ ఆర్‌డిఒ వద్ద 2010లో ఇచ్చిన తీర్పు ద్వారా సింహాచలం దేవస్థానానికి 1996-1997లో చినగదిలి, పెందుర్తి తహశీల్దార్లు ఇచ్చిన రైత్వారీ పట్టాలు సక్రమం కాదంటూ పేర్కొనడం జరిగింది. ఆర్‌డిఒ కోర్టు తీర్పును సైతం ఇంతవరకూ అమలు చేయలేదు. 2019లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం 100 రోజుల్లో పంచగ్రామాల భూ సమస్యను రైతులకు అనుకూలంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చి 2019 జులై 25న జీవో 794, 2020 అక్టోబర్ 29న ఒక జీవో 854 ఇచ్చేసి చేతులు దులుపుకుంది.

ఎన్నికల ఆయుధంగా.....

2024 ఎన్నికల్లో కూటమి పార్టీలకు చెందిన నేతలు అధికారంలోకి రావడం కోసం పంచగ్రామాలను ఆయుధంగా వాడుకోవడం తెలిసిందే.. తాజాగా టిడిపి ప్రభుత్వం పాత వైసిపి ఇచ్చిన 'రీపేర్ల' జీవోనే తిరగదోడుతూ రైతులకు ఎంతో మేలు చేస్తున్నట్లు ప్రచారం చేస్తోంది. గడిచిన నాలుగైదు రోజులుగా యారాడ, మధురవాడ, ములగాడ పరిసర ప్రాంతాల్లో 1785 ఎకరాల ప్రత్యామ్నాయ భూమి కోసం దేవాదాయ శాఖ తన సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బందితో భూమికి భూమి కోసం అన్వేషణ సాగిస్తోంది. ఈ గ్రామాలను ఈ ప్రాంత రైతులు ఏళ్లతరబడి చూస్తూనే ఉన్నారు. ఈ సారైనా న్యాయం జరగాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. గిల్‌మెన్ సర్వే రికార్డులలో రైతుల పేర్లే పైన తెలిపిన 1785 ఎకరాల్లోనూ ఉన్నాయి. అంటే ప్రజల వద్ద పూర్తి ఆధారాలు, రికార్డులు ఉన్నాయి. ఈ భూమిని దేవాదాయ శాఖ స్వచ్ఛందంగా వదిలేయాలి. కానీ టిడిపి గతంలో దేవస్థానానికి జారీచేయించిన రైత్వారీ పట్టాలతో సంబంధిత శాఖకు లేని హక్కులు సంక్రమించాయి. దీంతో ఇది వదులుకుంటే తమకు అంతే సమానమైన భూమి కావాలంటూ భూ అన్వేషణ చేపట్టారు.

ప్రభుత్వానికి పట్టని కార్మికుల గోడు

వరకు జరిగిన కార్మికుల ఆందోళనలో ప్రభుత్వ యంత్రాంగం తీసుకున్న చొరవ లేదు. కార్మికశాఖ మంత్రికి వినతిపత్రం సమర్పించినా ఫలితం లేకుండాపోయింది. చట్ట విరుద్ధ లే ఆఫ్ ప్రకటించిన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వ యంత్రాంగం మౌనంగావుంటోంది. ఉపాధిలేక తమకు కుటుంబాల పోషణ కష్టంగావుందని కార్మికులు మొరపెట్టుకున్నా ఆలకించడంలేదు. అభిజిత్ కంపెనీ లే ఆఫ్ ఎత్తివేసినట్లు యాజమాన్యం నుంచి సమాచారంలేదని విఎస్ఇజెడ్ అసిస్టెంట్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ రమ్య తెలిపారు. అభిజిత్ యాజమాన్యం లే ఆఫ్ ఎత్తివేసి కార్మికులకు ఉపాధి కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఆర్.రాము, జిల్లా కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. అభిజిత్ గేట్ దగ్గర ఆందోళన చేసిన కార్మికులకు మద్దతు ప్రకటించారు. లే ఆఫ్ ఎత్తివేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

విద్యా, వసతి దీవెన బకాయిలు విడుదల చేయాలి

కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షులు జనార్ధన్, సభ్యులు వరహాలు, విష్ణు, రవి గణేష్, మహేంద్ర, రాము, రవి, గీతాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ అభివృద్ధికి కృషిచేస్తానని కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు చెప్పారు. కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా జిల్లాలో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా జిల్లాలోని వివిధ వేర్‌హౌస్‌లను, ఇతర కార్యాలయాలను సందర్శించారు. అనంతరం పిఠాపురం కాలనీలోని జనశిక్షణ సంస్థాన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, త్వరలో రాష్ట్రంలో మూడు ప్రధాన పోర్టులు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఎగుమతులు ద్వారా సంస్థ ఆదాయం పెంచుతామని చెప్పారు. కార్పొరేషన్ జనరల్ మేనేజర్ హనుమా నాయక్ మాట్లాడుతూ, ఎగుమతులకు అవకాశం ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం లేపాక్షి, నాంది బ్రాండ్ పేరుతో నోటు పుస్తకాలు విక్రయిస్తున్నామని, ప్రభుత్వ శాఖలకు సిమెంట్ సరఫరా చేస్తున్నామని తెలిపారు.

గర్భాశయ కేన్సర్‌కు స్క్రీనింగ్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :కమ్యూనిటీ మెడిసిన్, గీతం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్‌తో కలిసి గైనకాలజీ, ప్రసూతి విభాగం ద్వారా గర్భాశయ కేన్సర్‌కు బుధవారం స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా గైనకాలజీ ప్రొఫెసర్లు డాక్టర్ గీతా కుమారి, డాక్టర్ ప్రభావతి, కమ్యూనిటీ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, 30 నుంచి 50 ఏళ్ల మధ్య ఉన్న మహిళలు గర్భాశయ కేన్సర్ (సర్వైకల్)పై అవగాహన కలిగి ఉండాలన్నారు. కడుపు నొప్పి, బరువు తగ్గడం, రుతుచక్రం మధ్య రక్తస్రావం, మలంలో రక్తం, లైంగిక చర్య తర్వాత రక్తస్రావం, యోని నుంచి అసాధారణ స్రావాలు, రుతువిరతి తర్వాత రక్తస్రావం వంటి లక్షణాలు ఉంటే కేన్సర్ లక్షణాలుగా భావించి వైద్యులను సంప్రదించాలని సూచించారు. వైద్యాధికారి డాక్టర్ ఎంవివి.మురళీమోహన్ సమన్వయకర్తగా వ్యవహరించారు.



గర్భాశయ కేన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

వృద్ధులకు సమాజంలో గౌరవం కల్పించాలి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : సమాజంలో వృద్ధుల ఆవశ్యకతను, ప్రాధాన్యతను గుర్తించడం ఎంతో అవసరమని హెరిటేజ్ ఫౌండేషన్ ఇండియా చైర్మన్ డాక్టర్ కె.ఆర్ గంగాధరన్ అన్నారు. హెరిటేజ్ ఫౌండేషన్ ఆర్.ఆర్.టి.సి, కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయం-సాధికారత మంత్రిత్వ శాఖ, ఎయు జాతీయ సేవా పథకం సంయుక్తంగా బుధవారం బీచ్ రోడ్డులోని కాళీమాత ఆలయం నుంచి వైఎంసిఎ వరకు అవగాహన నడక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాధరన్ మాట్లాడుతూ సమాజంలో వృద్ధులకు తగిన గౌరవాన్ని కల్పించడం, వారికి భద్రతను ఇవ్వడం ఎంతో అవసరమని చెప్పారు. నేడు సమాజంలో వృద్ధులకు, యువతకు మధ్య కొంత దూరం ఏర్పడుతోందని ఇది సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎయు జాతీయ సేవా పథకం సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, హెరిటేజ్ ఫౌండేషన్ ప్రతినిధులు, జాతీయ సేవా పథకం వాలంటీర్లు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్త బివి.రామారావు మృతి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నగరానికి చెందిన పారిశ్రామికవేత్త బి.వి.రామారావు (80) తుది శ్వాస విడిచారు. ఆరోగ్యం క్షీణించడంతో గత కొద్ది రోజులుగా మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య సతీ సావిత్రి, కుమార్తె వసంతలక్ష్మి, కుమారుడు బి.వి.రామ్ ఉన్నారు. బి.వి.రామారావు పార్థివ దేహాన్ని పాత వెంకోజీపాలెంలోని ఎం.వి.వి.ప్రెసిడెన్సీలో బుధవారం మధ్యాహ్నం నుంచి అభిమానులు, శ్రేయోభిలాషుల సందర్శనార్థం ఉంచారు. నగరానికి చెందిన పలువురు ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలు, అభిమానులు రామారావు పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బి.వి.రామారావు అంత్యక్రియలు గురువారం రాజమండ్రిలో నిర్వహిస్తామని ఆయన కుమారుడు బి.వి.రామ్ తెలిపారు.



బివి.రామారావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబీకులు, బంధువులు

కాంటినెంటల్ హాస్పిటల్‌కు జెసిఐ అక్రిడేషన్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : కాంటినెంటల్ హాస్పిటల్‌కు ప్రతిష్టాత్మకమైన జాయింట్ కమిషన్ ఇంటర్నేషనల్ (జెసిఐ) అక్రిడేషన్ వచ్చినట్లు హాస్పిటల్స్ సిఎండి డాక్టర్ గురు ఎన్ రెడ్డి తెలిపారు. బుధవారం నోవాటెల్‌లో మీడియా ఆయన మాట్లాడుతూ ఆంధ్రాలోని విశాఖలో హాస్పిటల్ నిర్మాణానికి పనులు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు. నాలుగు సార్లు జెసిఐ అక్రిడేషన్ పొందిన ఏకైక హాస్పిటల్‌గా తమ సంస్థ గుర్తింపు పొందిందని చెప్పారు.

అక్రమార్కుల అధీనంలో గ్రామకంఠం?



అధీనంలో ఉన్న స్థలానికి వేసిన ఫెన్సింగ్

- రూ.100 కోట్లు విలువైన భూమికి టెండర్
- చోద్యం చూస్తున్న గ్రామ పంచాయతీ, రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని గంభీరం గ్రామంలో సర్వేనెంబర్ 140లో సుమారు రూ. వంద కోట్ల విలువైన 13.80 ఎకరాల గ్రామకంఠం స్థలం నాలుగేళ్లుగా అక్రమార్కుల అధీనంలోకి వెళ్లిపోయిందని స్థానికులు అంటున్నారు. ఈ స్థలంలో పక్కాగా వాచ్‌మెన్ షెడ్‌తోపాటు చుట్టూ ఫెన్సింగ్ వేసి సొంతం చేసుకోవాలని చూస్తున్నారని ఆరోపిస్తున్నారు.

గంభీరం గ్రామపంచాయతీలో సుమారు 100 కుటుంబాల యాదవులు, రజకులు, విశ్వబ్రాహ్మణులు, పద్మశాలీలు, దళితులు తదితరులు ఈ గ్రామకంఠంలో ఉండేవారు. 1980లో ఇందిరాగాంధీ హయాంలో దళితులకు జాతీయ రహదారి పక్కన స్థలాలు కేటాయించడంతో వారంతా అక్కడకు వచ్చేశారు. అప్పట్లో గ్రామకంఠం చుట్టూ కొండలు, అడవి ప్రాంతం కావడంతో మిగతావారు కూడా భయపడి రోడ్డుపక్కకు చేరుకున్నారని అంటున్నారు. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న గ్రామకంఠం స్థలాన్ని ఎపిఐఐసి తీసుకోవడానికి ప్రయత్నం చేయగా అప్పట్లో గ్రామస్తులు అడ్డుపడ్డారు. ఈ సందర్భంగా జరిగిన గొడవల్లో ఎపిఐఐసి ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు నమోదైందని, తర్వాత ప్రజలంతా కోర్టుకు వెళ్లడంతో ఎపిఐఐసి ఆ స్థలాన్ని ఖాళీ చేసి రెవెన్యూకు అప్పగించిందంటున్నారు. రెవెన్యూ రికార్డుల్లో ఇది గ్రామకంఠంగా నమోదై ఉండడంతో రెవెన్యూశాఖ దీనిని గ్రామ పంచాయతీకి బదలాయించారు.

అలా కొన్నేళ్లుగా పంచాయతీ అధీనంలో ఉన్న ఈ గ్రామకంఠం స్థలాన్ని నాలుగేళ్ల క్రితం కొంతమంది వ్యక్తులు ఆక్రమించి, దాని చుట్టూ ఫెన్సింగ్ వేసి, మధ్యలో రేకుల షెడ్డును నిర్మించి సొంతం చేసుకోవాలని చూస్తున్నారని స్థానికులు అంటున్నారు. అప్పట్లో ఈ వ్యవహారం వెనుక కొందరు పెద్దల ప్రమేయం ఉండడంతో అటుగా వెళ్లేందుకు పంచాయతీ, రెవెన్యూ అధికారులు సాహసించలేదు. దీంతో వారు మరింత బరితెగించి, గ్రామకంఠం స్థలాన్ని ఆనుకుని ఉన్న మరో 50సెంట్లు స్థలాన్ని కూడా కలిపేసుకున్నారని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ, రెవెన్యూ అధికారులు దీనిపై దృష్టి సారించి, గ్రామకంఠం స్థలాన్ని పరిరక్షించి, గ్రామపంచాయతీ, ప్రజా ప్రయోజనానికి వినియోగించే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై సంబంధిత అధికారుల చర్యలు, వివరణ, స్పందన ఎలా ఉంటుందో చూడాలి.

దీనిపై తహశీల్దార్ శ్యాం ప్రసాద్ వివరణ కోరగా జిఒ 187 ప్రకారం ప్రభుత్వ భూములను భవిష్యత్తు అవసరాల కోసం ఉంచుతామని, వాటిని ఆక్రమణ చేసిన వారిపై చర్యలు ఉంటాయన్నారు.

కాగా గత వైసిపి ప్రభుత్వ హయాంలో బడాబాబుల కన్ను ఈ భూమిపై పడిందని, స్థానిక నేతల సహకారంతోనే దీన్ని ఆక్రమణకు పాల్పడ్డారని గ్రామ మాజీ సర్పంచ్ వానపల్లి ముత్యాలరావు అంటున్నారు.

ఇదే గ్రామకంఠం స్థలంలో గతంలో ఆర్‌టిసి ఉద్యోగులు, క్రిస్టియన్లకు ఇళ్లస్థలాలకు లేఅవుట్లు వేసి క్రయవిక్రయాలు చేశారని, స్థానికులు అభ్యంతరంతో అవన్నీ పెండింగ్‌లో ఉన్నాయని వైసిపి మండల ఉపాధ్యక్షురాలు బొట్ట లక్ష్మి రామకృష్ణ అంటున్నారు.



వాచ్‌మ్యాన్ కోసం నిర్మించిన రేకుల షెడ్

పార్కు స్థలాలను ప్రయివేటుకు ఇవ్వొద్దు

ప్రజాశక్తి -మధురవాడ : పార్కు స్థలాలను ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టే చర్యలను మానుకోవాలని రత్నగిరి కాలనీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు దాసరి శ్రీను కోరారు. పిఎం.పాలెం హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన పార్కు స్థలాన్ని ప్రైవేటు పాఠశాలకు అప్పచెప్పుతూ, దానికి జివిఎంసి నుంచి రూ. 20 లక్షలు నిధులు ఖర్చుపెట్టనున్నారన్న వార్తలు వెలువడిన నేపథ్యంలో పార్కు స్థలాలను ప్రయివేటుకు ఇవ్వొద్దని కోరారు. అప్పట్లో హౌసింగ్ బోర్డ్ కాలనీ నిర్వాసితుల నుంచి పిఎం.పాలెంలోని పార్కులకు అవసరమైన డబ్బులు వసూలు చేశారన్నారు. తర్వాత ఆయా ప్రాంతం జివిఎంసిలో విలీనమైందన్నారు. ఈ నేపథ్యంలో పార్కులను, వాటిలోని స్థలాలను కాలనీవాసుల ప్రయోజనాలకు వినియోగించాలే తప్ప, ఇలా ప్రయివేటుకు కట్టబెట్టడం సమంజసం కాదన్నారు. ఇప్పటికే పిపిపి విధానంలో కొన్ని పార్కులను ఇవ్వగా, వాటిని ప్రయివేట్ వ్యక్తుల పెళ్లిళ్లు, పుట్టినరోజులు, ఇతర కార్యక్రమాలకు అద్దెలకిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో కాలనీవాసులు సామాజిక ఆస్తిగా వున్న విలువైన పార్కుల స్థలాన్ని ప్రయివేటు వ్యక్తులకుఅప్పగించాలన్న చర్యలు మానుకోవాలన్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వెల్లడించారు.

కంటి ఆరోగ్యంపై విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి- వేపగుంట : ప్రపంచ దృష్టి దినోత్సవం, బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాలల విద్యార్థులకు కంటి ఆరోగ్యంపై ఈనెల 13 వరకు వివిధ పోటీలను నిర్వహించనున్నట్లు శంకర్ ఫౌండేషన్ హాస్పిటల్ డిజిఎం (పిఆర్) కె.బంగార్రాజు తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం కంటి ఆరోగ్యంపై నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో నగరంలోని 22 పాఠశాలలకు చెందిన 113 మంది విద్యార్థులు పాల్గొన్నారు. శంకర్ ఫౌండేషన్ జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్, డిజిఎం వి.రమేష్ కుమార్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించగా, రజని, పి.లలిత విజేతల పేర్లను ప్రకటించారు. డాక్టర్ కెకెఆర్ గౌతమ్ హైస్కూల్, ఎస్ఆర్ఐ స్ప్రింగ్స్ స్కూల్, విజ్ఞాన స్టీల్ సిటీ స్కూల్ విద్యార్థులు మొదటి మూడు బహుమతులను గెలుచుకోగా, మరికొందరికి కన్సోలేషన్ బహుమతులు ప్రకటించారు. విజేతలకు ఈనెల 13న ఉదయం నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రిలో బహుమతులను అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే ఆసక్తి ఉన్న పాఠశాల యాజమాన్యాలు కె.వినోద్‌కుమార్ ఫోన్ నెంబర్ 9121005933కు సంప్రదించాలని సూచించారు.

సమస్యలపై 104 సిబ్బంది వినతి



డిఎంహెచ్‌ఒకు వినతిపత్రం ఇస్తున్న 104 ఉద్యోగులు

ప్రజాశక్తి -సీతమ్మధార : తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 104 సిబ్బంది బుధవారం డిఎంహెచ్‌ఒ డాక్టర్ జగదీశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా 104 ఉద్యోగుల సంఘం విశాఖ జిల్లా ఉపాధ్యక్షులు తాతబాబు మాట్లాడుతూ, మూడు నెలల వేతన బకాయి చెల్లింపు, 104 సేవలను ప్రభుత్వమే పిహెచ్‌సిల ఆధ్వర్యంలో నిర్వహించి ప్రజాధనం వృథా కాకుండా చూడాలని, 2020 తరువాత విధుల్లో చేరిన 104 డ్రైవర్ల నుంచి జిఒ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని, అరబిందో యాజమాన్యం వసూలు చేసిన పిఎఫ్ సొమ్మును వాపసు చేయాలని, 74 మంది సీనియర్ డ్రైవర్లకు శ్లాబ్ అమలు చేయాలని, డిఎస్‌సి ద్వారా నియమితులైన డ్రైవర్లను కాంట్రాక్టు విధానంలోకి మార్చాలని, ఉద్యోగులకు గ్రూపు ఇన్సూరెన్స్ చేయించాలని కోరారు. కూటమి ప్రభుత్వం తమ సమస్యలపై సానుకూలంగా స్పందించి న్యాయం చేయాలని వేడుకున్నారు. కార్యక్రమంలో 104 ఉద్యోగుల సంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి భాస్కర్, కోశాధికారి ప్రకాష్ పాల్గొన్నారు.

చైతన్య టెక్నో స్కూళ్లలో రక్తదాన శిబిరాలు

ప్రజాశక్తి -కరాస: జివిఎంసి 52వ వార్డు ఎన్ఎడిలోని చైతన్య టెక్నో స్కూల్లో సంస్థ ఛైర్‌పర్సన్ డాక్టర్ బి.ఝాన్సీ లక్ష్మిబాయి జన్మదినం సందర్భంగా బుధవారం ఎన్‌టిఆర్ ట్రస్ట్ బ్లడ్‌బ్యాంకు సౌజన్యంతో రక్తదానశిబిరం నిర్వహించారు. వైజాగ్ సిటీ శ్రీచైతన్య స్కూల్స్ రీజనల్ ఇన్‌ఛార్జి అహ్మద్ అలీ, పాఠశాల ప్రిన్సిపాల్ జె.మహేష్, ప్రిన్సిపల్స్ పి.తారకేశ్వరరావు, లతా సువర్ణ, డీన్ ఎం.శ్రీనివాస్, పాల్గొన్నారు.

గాజువాక: స్థానిక చైతన్యనగర్‌లోని శ్రీచైతన్య టెక్నో స్కూల్లో విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ ఝాన్సీలక్ష్మీబాయి జన్మదినం సందర్భంగా ఎన్‌టిఆర్ బ్లడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదానశిబిరం నిర్వహించారు. 40మంది చైతన్య అధ్యాపకులు రక్తదానం చేశారు. చైతన్య విద్యాసంస్థల ఎజిఎం శ్రీనివాసరావు, గాజువాక రీజియన్ ఇన్‌ఛార్జి ఎం.రమణారావు, కాలేజీ ఎజిఎం రమణ, స్కూల్ ఎజిఎం సురేష్, ప్రిన్సిపల్ పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి- ఆనందపురం:మండలంలో బోని, జగన్నాధపురం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తుంది నిర్వహించారు. భీమిలి ఎడిఎ బొడ్డేపల్లి విజయప్రసాద్ మాట్లాడుతూ, ఖరీఫ్ తర్వాత రెండో పంటగా రాగులు సాగుచేయాలన్నారు సూచించారు. ఎడిఎ చదువుల సుబ్రహ్మణ్యం, ఎఒ సిహెచ్ సంధ్యా రత్నప్రభ, బోని, చందక అగ్రికల్చర్ అసిస్టెంట్లు జి .దిలీప్‌చక్రవర్తి, ఎన్. మాధురి పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాల సిఎస్ఎంఅండ్‌డి విభాగాధిపతి లక్ష్మి రాసిన 'ఆధునిక యుగంలో క్రిప్టోగ్రఫీ, నెట్‌వర్క్' పుస్తకాన్ని అవంతి విద్యాసంస్థల ఛైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు బుధ వారం కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సున్నితమైన సమాచారాన్ని కాపాడుకోవడం, ఎన్‌క్రిప్షన్, ఫైర్ వాల్‌లు, విపిఎన్‌లు, బ్లాక్‌చైన్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి అధునాతన సాంకేతికత ద్వారా సురక్షితమైన కమ్యూనికేషన్‌ను నిర్ధారించుకోవచ్చని అన్నారు. దీనికి సంబంధించిన వివరాలను పుస్తకరూపంలోకి తెచ్చిన అధ్యాపకులు లక్ష్మిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ చంద్రశేఖర్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు

మంచి ఆహారంతో ఆరోగ్యకర జీవనం

ప్రజాశక్తి - అరిలోవ : మంచి ఆరోగ్యకర జీవనానికి ప్రతిఒక్కరికీ మంచి పౌష్టికాహారం అవసరమని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. బుధవారం జివిఎంసి రెండవ జోన్ ఆరిలోవ పినాకిల్ హాస్పిటల్ వద్ద శ్రీసత్య హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతిఒక్కరూ సరైన ఆహారం తీసుకోక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, వారికి ఇటువంటి హెల్త్‌క్లినిక్‌లు ఎంతో అవసరమన్నారు.

నేరాలు ఘోరాలు

బైక్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-ఆనందపురం: మండలంలోని గొట్టిపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు పోలీసులు తెలిపిన వివరాలివి. గొట్టుపల్లి కల్లాలు చెందిన పోలిపల్లి కాశీ విశ్వేశ్వరరావు (49) బుధవారం జిరాక్స్ పనిపై ఇంటి నుంచి బయలు దేరి రోడ్డు దాటుతుండగా, గొట్టుపల్లి నుండి ఆనందపురం వైపు వస్తున్న బైకు అదుపుతప్పి ఢీకొంది. ఈ ప్రమాదంలో తనకు తీవ్రగాయాలైన కాశీవిశ్వేశ్వరరావును గాయత్రి ఆసుపత్రికి తరలించగా, ప్రథమచికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కెజిహెచ్‌కు తరలించగా అక్కడ మృత్యువాత పడ్డాడు. మృతుని భార్య వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు ఆనందపురం సిఐ చింత వాసునాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ పందిరి శివ కేసు దర్యాప్తు చేస్తున్నారు

మహిళ మెడలో బంగారం చోరీ



బాధిత మహిళ పార్వతి

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని అనంతవరం గ్రామానికి చెందిన కల్లెంపూడి పార్వతి శరీరంపైనున్న బంగారాన్ని బుధవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధితురాలి సమాచారం మేరకు, గ్రామంలోని బంగారమ్మ తల్లి గ్రామ దేవత గుడి ప్రక్కన తన పొలం గట్టుపై పశువులకు గడ్డి కోస్తుండగా, బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఒంటరిగా ఉన్న పార్వతి వద్దకు వెళ్లి, ఆమె చీర కొంగుతోనే ముఖం కప్పి, మెడలో ఉన్న శతమానాలతో కలిపి ఉన్న మూడు తులాల బంగారం తాడు, కుడి చెవికి ఉన్న ఆభరణాన్ని బలవంతంగా తెంచి బైక్‌పై పారిపోయారు. చోరీకి గురైన బంగారు ఆభరణాల విలువ రూ.2.60లక్షలు ఉంటుందని బాధితురాలు వాపోతోంది. దోపిడీని అడ్డుకునే క్రమంలో బాధితురాలి కుడి చెవి, ఎడమ చేతిపై గాయాలయ్యాయి దీనిపై పద్మనాభం పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలుఫిర్యాదు చేసింది.

. నెలరోజుల క్రితం ఇదే రహదారిలో ఉన్న పెంట గ్రామానికి చెందిన శివాలయంలోనూ, కొవ్వాడ గ్రామానికి చెందిన బంగారమ్మ ఆలయంలోనూ చోరీలు జరిగాయి. పోలీసుల నిఘా కొరవడడం, చోరీ కేసుల్లో నిందితులను గుర్తించి పట్టుకోవడంలో వైఫల్యం వల్లే వరుస ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఈ ప్రాంతీయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

4 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలోని ఎండపల్లి గ్రామం వద్ద వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా నాలుగు కిలోల గంజాయిని, ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నట్లు స్థానిక ఎస్ఐ రమేష్ తెలిపారు. పట్టుబడిన వారిలో ముప్పల శ్రీను జి మాడుగుల కు చెందిన వ్యక్తి కాగా మరో ఇద్దరు వ్యక్తులు హైదరాబాద్‌కు చెందిన సాయి ప్రవీణ్, నిఖిల్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

ఆటో ప్రమాదంలో 11 మందికి గాయాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : పాత పోస్ట్ ఆఫీస్ ప్రాంతంలోని మేరీ మాత ఆలయం ఘాట్ రోడ్డులో బుధవారం ఉదయం జరిగిన ఆటో ప్రమాదంలో 11 మంది గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో కెజిహెచ్‌కు తరలించారు. వన్ టౌన్ ట్రాఫిక్ పోలీసుల కథనం ప్రకారం... విజయనగరం జిల్లా ఎల్.కోట (లక్కవరపు కోట) సమీపంలోని రంగరాయపురం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ వారాది సద్దురు ఆటోలో గ్రామస్తులు విశాఖపట్నంలోని రోజ్ హిల్స్ మేరీమాత దర్శనానికి వచ్చారు. దర్శనం అనంతరం అక్కడ నుంచి ఫిషింగ్ హార్బర్‌కు వెళుతుండగా ఆటో బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. దీంతో ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఆటో ఢీకొని ప్రమాదం జరిగింది. ఆటోలో ఉన్న 11 మందికి గాయాలయ్యాయి. వీరిలో ఎస్.పరదేశి (45) తీవ్రంగా గాయపడ్డారు. కేసును ట్రాఫిక్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వేములవలసలో డ్యాన్స్ స్కూల్ ప్రారంభం

ప్రజాశక్తి-ఆనందపురం: యువత తమ అభిరుచుల మేరకు లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనకు పట్టుదలతో ముందుకు పోవాలని వేములవలస పంచాయతీ ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ అన్నారు. బుధవారం వేములవలస పూల మార్కెట్ సమీపంలో ఏర్పాటు చేసిన మైఖేల్ డ్యాన్స్ స్కూల్‌ను ప్రారంభించి మాట్లాడారు. యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఆరాటపడకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఉపాధి పొందాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎండిఎస్ బాయ్స్, డి 16 టైటిల్ విన్నర్ సాహిత్, రాజు పాల్గొన్నారు

జడ్జిలకు రెవెన్యూ రికార్డులపై అవగాహన



రెడ్డిపల్లి సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జడ్జిల బృందం

ప్రజాశక్తి-పద్మనాభం :భూ సమస్యలు, రెవెన్యూ రికార్డులపై అవగాహనకు ఆరుగురు ట్రైనీ న్యాయమూర్తుల బృందం బుధవారం మండలంలోని రెడ్డిపల్లి సచివాలయాన్ని సందర్శించారు. జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు పద్మనాభం తహశీల్దార్ కె.ఆనందకుమార్ వీరికి అవసరమైన ఏర్పాట్లు చేశారు.

ఎలమంచిలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి పి.స్వాతిభవాని, ఎలమంచిలి అడిషనల్ సివిల్ జడ్జి టి.వీర రాఘవేంద్రరావు, విశాఖపట్నం కంట్రోలర్ కం అడిషనల్ సివిల్‌జడ్జి నికిత సింగర్, నర్సీపట్నం. ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఎస్ మధుసూధనరావు. విశాఖపట్నం ఫస్ట్ క్లాస్ స్పెషల్ మొబైల్ కోర్టు అడిషనల్ సివిల్ జడ్జి కె.లలితాదేవి, నర్సీపట్నం అడిషనల్ సివిల్ జడ్జి ఎం.రోహితలతో కూడిన న్యాయమూర్తుల బృందం రెడ్డిపల్లి గ్రామ సచివాలయంతోపాటు తహశీల్దార్ కార్యాలయంలోని పలు. రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని రైతుల భూముల్లోనికి వెళ్లి పరిశీలన చేశారు. ముందుగా పద్మనాభం కుంతి మాధవస్వామి ఆలయంలో అనంత పద్మనాభస్వామిని. దర్శించుకున్నారు. ఆలయ పురోహితులు సీతారామాంజనేయులు ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వాగతించి, ప్రత్యేక పూజలు చేయించారు.

వెయిట్ లిఫ్టింగ్ విజేతలకు అభినందన



మిస్టర్ ఆంధ్రా గోపీచంద్‌ను అభినందిస్తున్న మధుకుమార్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆంధ్రా యూనిర్సిటీ అంతర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌గా స్థానిక డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజీ విద్యార్థులు నిలిచారు. ఈ నెల 2 నుండి 4 వరకు బుల్లయ్య కళాశాలలో నిర్వహించిన పోటీల్లో పురుషుల వెయిట్ లిఫ్టింగ్, మహిళల పవర్ లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్ ఓవరాల్ ఛాంపియన్‌షిప్ రన్నర్స్‌గా నిలిచారు. బెస్ట్ ఫిజిక్‌లో మిస్టర్ ఆంధ్రా టైటిల్‌ను ఎంసిఎ సెకెండియర్ విద్యార్థి గోపీచంద్ కైవసం చేసుకున్నారు. విజేతలను కళాశాల సెక్రెటరీ అండ్ కరెస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జిఎస్‌కె.చక్రవర్తి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి.దీపక్ చౌదరి, వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ వై. శ్రీనివాసరావు, మేజర్ టి.బ్రహ్మానందరెడ్డి, లెక్చరర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ యు.గంగాభవాని అభినందించారు.

11 నుంచి గీతంలో బాలల సైన్స్ కాంగ్రెస్

ప్రజాశక్తి -మధురవాడ:బాలలలో శాస్త్ర విజ్ఞానం పట్ల ఆసక్తిని పెంచడానికి, నూతన ఆలోచనలను ప్రోత్సహించడానికి జవహర్ నవోదయ విద్యాలయ సమితి ఆధ్వర్యంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా ఈనెల 11నుంచి 15 వరకు ప్రాంతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌ను నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లును విస్తృతంగా చేస్తున్నట్లు గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి తెలిపారు. దక్షిణ భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి జవహర్ నవోదయ విద్యాలయాల నుంచి ఎంపిక చేసిన విద్యార్థులు ఈ బాలల సైన్స్ కాంగ్రెస్‌కు హాజరు కానున్నారు. శాస్త్ర విజ్ఞానంలో వస్తున్న మార్పులు, ఆసక్తికర పరిశోధనలపై ప్రసంగాలతో పాటు గీతంలోని అధునాతన ప్రయోగశాలలను సందర్శించే అవకాశం విద్యార్థులకు కల్పిస్తున్నామన్నారు. సైన్స్‌లో విద్యార్థుల సందేహాల నివృతికి గీతం పరిశోధకులు అందుబాటులో ఉంటారన్నారు.

అపరిష్కృత సమస్యలపై ప్రజా పోరాటం

- ఆరిలోవలో జూనియర్ కళాశాల, రైతు బజార్ ఏర్పాటు చేయాలి
- మధురవాడ భూనిర్వాసిత రైతులకు ఇళ్లు ఇవ్వాలి
- సిపిఎం జోన్ మహాసభలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పద్మ

ప్రజాశక్తి - ఆరిలోవ : మద్దిలపాలెం, మధురవాడ, ఆరిలోవ ప్రాంతాల్లో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి సిపిఎం ఆధ్వర్యాన ప్రజాపోరాటాలను సిద్ధం కావాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.పద్మ పిలుపునిచ్చారు. బుధవారం తోటగరువులోని ఎర్నిమాంబ కళ్యాణ మండపంలో సిపిఎం ఆరిలోవ, మధురవాడ, మద్దిలపాలెం జోన్‌ల ఉమ్మడి మహాసభ నిర్వహించారు. మూడేళ్లలో జరిగిన పోరాటాలపై సుదీర్ఘ చర్చ జరిగింది. భవిష్యత్ కార్యాచరణ, ప్రజా ఉద్యమాలపై తీర్మానాలు, నిర్ణయాలు చేసారు. అంతక ముందు సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరితో పాటు నగరంలోని ఇటీవల మృతి చెందిన ఆర్‌పి రాజు, వి.కృష్ణమూర్తి, తవిటి నాయుడు, రమణమ్మ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు.

ముందుగా మాజీ కార్పొరేటర్ రెడ్డిపల్లి బాబూరావు పార్టీ జెండాను ఆవిష్కరించారు. సిపిఎం నాయకులు పి.శంకర్, భారతి, కుమారి అధ్యక్షవర్గంగా నిర్వహించిన మహాసభలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పద్మ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై పెనుభారాలు మోపుతున్నాయన్నారు. మరోవైపు



సిపిఎం మహాసభలో మాట్లాడుతున్న ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పద్మ

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ చర్యలు వేగవంతం చేశాయన్నారు. ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పార్టీ శ్రేణులు ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఆరిలోవ, మధురవాడ, మద్దిలపాలెం ప్రాంతాల్లో ప్రజా సమస్యలను పట్టించుకునే పార్టీ ఒక్క సిపిఎం మాత్రమేనని స్పష్టం చేశారు.

తూర్పు నియోజకవర్గంలో ప్రభుత్వం తరపున పేదలకు ఒక్క సెంటు భూమిని ఇవ్వకపోయినా, పోరాటాలతో వేలాది మందికి ఇళ్లు ఇప్పించిన ఘనత సిపిఎందేనన్నారు. కరోనా సమయంలోనూ ప్రజలకు సిపిఎం అండగా నిలిచిందని గుర్తు చేశారు.

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, జివిఎంసిలో పార్టీ ఫ్లోర్‌లీడర్ డాక్టర్ బి.గంగారావు, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి..కుమార్, బి.జగన్, జిల్లా కమిటీ సభ్యులు పి.మణి మాట్లాడుతూ, అపరిష్కృత దేవాలయ భూసమస్యలతోపాటు మధురవాడ, మద్దిలపాలెం ప్రాంతాల్లో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆరిలోవలో రైతుబజారు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, మధురవాడలో భూములు కోల్పోయిన నిర్వాసిత రైతులకు ఇళ్లు ఇవ్వాలని, చిరు వ్యాపారులపై దాడులు ఆపాలని మరో ఎనిమిది సమస్యలపై మహాసభలో తీర్మానం చేసి ఆమోదించారు.

మద్దిలపాలెం జోన్ కార్యదర్శిగా కృష్ణారావు


వి.కృష్ణారావు

సిపిఎం మద్దిలపాలెం జోన్ మహాసభలో నూతన కమిటీ ఎన్నికైంది. కమిటీ కార్యదర్శిగా వి.కృష్ణారావును ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా వి.నరేంద్ర కుమార్, డి.అప్పలరాజు, పి .శంకర్, పి.వెంకటరావు, బి. భారతి, డి.కొండమ్మ, పి.రాజ్ కుమార్, కె.కుమారి, ఎం.చంటి, అప్పడు, డి.నాగరాజు, ఐసి నాయుడులను ఎన్నుకున్నారు.

హెచ్‌పిసిఎల్ సామాజిక బాధ్యత స్ఫూర్తిదాయకం

- జివిఎంసి కమిషనర్ డాక్టర్ సంపత్ కుమార్


మొక్కలు నాటుతున్న జివిఎంసి కమిషనర్, హెచ్‌పిసిఎల్ ఇడి

ప్రజాశక్తి - అరిలోవ : నగరంలో కాలుష్య నియంత్రణకు సామాజిక బాధ్యతగా హెచ్‌పిసిఎల్ విశాఖ రిఫైనరీ చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమని జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ అన్నారు. బుధవారం రెండవ జోన్ ముడసర్లోవ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వద్ద హెచ్‌పిసిఎల్ సహకారంతో రూ. 88లక్షల సిఎస్‌ఆర్ నిధులతో 26,500 మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంగనాథన్ రామకృష్ణన్‌తో కలిసి శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా జివిఎంసి కమిషనర్ మాట్లాడుతూ హెచ్‌పిసిఎల్. సామాజిక బాధ్యతతో అందిస్తున్న మొక్కలను నగర పరిధిలో కాలుష్య నియంత్రణ, పర్యావరణాన్ని పరిరక్షణకు లబ్ధిదారులను, ప్రజలను భాగస్వాములను చేస్తూ పలుచోట్ల నాటతామన్నారు. ముడసర్లోవ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ ఆవరణలో ఈ మొక్కలు నాటి ఒక నందనవనంగా తయారు చేయాలని జివిఎంసి అదనపు కమిషనర్ ఆర్.సోమనారాయణను ఆదేశించారు. హెచ్‌పిసిఎల్ సహకారంతో అభివృద్ధి చేయనున్న గార్బేజ్ స్టేషన్‌లోని ప్రాంతాలను ఇరువురూ పరిశీలించారు.

హెచ్‌పిసిఎల్ ఇడి రంగనాథన్ రామకృష్ణన్ మాట్లాడుతూ విశాఖ నగరాభివృద్ధికి, కాలుష్య నిర్మూలనకు అవసరమైన సహకారాన్ని సామాజిక బాధ్యతగా అందించేందుకు తమ సంస్థ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు.కార్యక్రమంలో జివిఎంసి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, ఎంఎహెచ్ఓ డాక్టర్ ఎన్.కిషోర్‌కుమార్, ప్రధాన ఇంజనీరు పి.శివప్రసాదరాజు, ఎస్ఇ గోవిందరావు, ఇఇ దిలీప్, డిఇఇలు, ఎఇఇలు, హెచ్‌పిసిఎల్. సీనియర్ మేనేజర్ కాశీ నరసింహం, తదితరులు పాల్గొని మొక్కలను నాటారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం


ఆర్థికసాయం చెక్కు అందజేస్తున్న శ్రీరామచంద్ర మూర్తి


ప్రజాశక్తి- భీమునిపట్నం : మండలంలోని తాటితూరు జెడ్‌పి హైస్కూల్‌కు చెందిన 50 మంది టెన్త్ పేద విద్యార్థులకు ఈ ఏడాది పబ్లిక్ పరీక్షల ఫీజు, స్టడీ మెటీరియల్ నిమిత్తం స్థానిక కలిగొట్ల స్కిల్ల శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కె శ్రీరామచంద్ర మూర్తి బుధవారం రూ 10 వేలు ఆర్థికసాయం చెక్కును ఫౌండేషన్ కార్యాలయం వద్ద అందజేశారు. ఆయనకు పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యు శ్రీనివాసరావు, టిఎస్‌వి ప్రసాదరావు , విద్యార్థులు పాల్గొన్నారు

సమస్యల పరిష్కారానికి విఒఎల ధర్నా

ప్రజాశక్తి -భీమునిపట్నం :తమకు ఉద్యోగ భద్రత కల్పనతోపాటు మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్ రద్దు, ఐదునెలల వేతన బకాయి చెల్లింపు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం స్థానిక వెలుగు కార్యాలయం ఎదుట విఒఎలు ధర్నా నిర్వహించారు. ఎపి వెలుగు విఒఎ (యానిమేటర్స్) ల సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో సిఐటియు జోన్ నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్ అప్పలనాయుడు మాట్లాడుతూ, గత వైసిపి ప్రభుత్వం జారీ చేసిన మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేస్తామని విజయవాడ ధర్నాలో

అప్పటి టిడిపి నేత వర్ల రామయ్య హామీ ఇచ్చారని, ఇపుడేమో సంబంధిత శాఖ మంత్రి కె.శ్రీనివాస్ మూడేళ్ల తర్వాత విఒఎలను మార్చుకోవచ్చని ప్రకటించారన్నారు. కూటమి నేతలు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా మార్టులలో సరుకుల కొనుగోలుకు బలవంతపు టార్గెట్‌లిచ్చే పద్ధతి రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో విఒఎల సంఘం నాయకులు పార్వతి, పి వెంకట లక్ష్మి, కె కళ్యాణి, ఎస్ గున్న సంతోషి కుమారి పాల్గొన్నారు

పద్మనాభం: తమ సమస్యల పరిష్కారానికి వెలుగు విఒఎలు బుధవారం మండల కాంప్లెక్స్‌లోని వెలుగు కార్యాలయం వద్ద సిఐటియు భీమిలి డివిజన్ కార్యదర్శి. ఆర్ఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, వినతిపత్రం అందజేశారు. మూడేళ్ల కాలపరిమిత సర్క్యులర్ రద్దు, కనీస వేతనాలు, హెచ్‌ఆర్ పాలసీ


భీమిలి వెలుగు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విఒఎలు

అమలు, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పన, రాజకీయ వేధింపులు వీడాలని తదితర సమస్యలపై ఆందోళన చేపట్టారు.కార్యక్రమంలో విఒఎల సంఘం అధ్యక్షులు పికంచమ్మ, ఆర్ రామలక్ష్మి, బి లీల, మహాలక్ష్మి పాల్గొన్నారు.

రూ.2.31 లక్షల విలువైన సొత్తు రికవరీ

ఐదు చోరీ కేసుల్లో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి-అనకాపల్లి

పాయకరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో 4 కేసుల్లోనూ, పరవాడ పోలీస్ స్టేషన్లో ఒక కేసులోనూ ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.2.31 లక్షల విలువైన సొత్తును రికవరీ చేస్తున్నట్లు ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ఈ మేరకు ఎస్పీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చోరీ వివరాలను తెలియజేశారు. పాయకరావుపేట నాలుగు కేసుల్లో 8 గ్రాముల బంగారం, 2.120 కేజీల వెండి, 2 కేజీల ఇత్తడి, 15 జతల బట్టలు, ఒక హోమ్ థియేటర్, 2 టీవీలు, 1,240 కేజీల బరువు తూచే ఇనప గుళ్ళు స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను పాయకరావుపేట పోలీసులు చేశారు. పరవాడ పోలీస్ స్టేషన్ చోరీ కేసులో బంగారు పుస్తెల తాడు 2 తులాలు, ఒక బంగారం చేతివేలి ఉంగరం చిన్నది, ఒక జత వెండి పట్టీలు 10 తులాలు, ఒక మొబైల్ ఫోను పరవాడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పాయకరావుపేట చోరీ కేసుల్లో ఇద్దరు నిందితులు చెడు వ్యసనాలకు బానిసలైన విశాఖ, పాయకరావుపేటకు చెందిన వారు కాగా పరవాడ చోరీ కేసులో పట్టుబడ్డ నిందితుడు అనకాపల్లి జిల్లా మారేడుపూడి పంచాయితీ గన్నువానిపాలెనికి చెందినవాడు. వీరి ముగ్గురిపై 54 కేసులు వివిధ పోలీస్ స్టేషన్లో నమోదు ఉన్నాయని ఎస్పి తెలిపారు. పై కేసుల్లో నిందితులను అరెస్ట్ చేసి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్న సందర్భంగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పాయకరావుపేట ఇన్స్పెక్టర్ అప్పన్న, సిసిఎస్ ఇన్స్పెక్టర్ అప్పలనాయుడు, పరవాడ ఇన్స్పెక్టర్ మల్లికార్జున రావు, సిసిఎస్ సిబ్బందిని, క్లూస్ టీం, ఐటీ కోర్ సిబ్బందిని అభినందించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ క్రైమ్స్ ఎల్.మోహన్‌రావు, పరవాడ డిఎస్‌పి కెవి.సత్యనారాయణ, పరవాడ ఇన్స్పెక్టర్ మల్లికార్జునరావు, సిసిఎస్ ఇన్స్పెక్టర్ అప్పలనాయుడు, పాయకరావుపేట ఇన్స్పెక్టర్ అప్పన్న, పాయకరావుపేట ఎస్సై పురుషోత్తం, పరవాడ ఎస్సై కృష్ణారావు, సిసిఎస్ సిబ్బంది పాల్గొన్నారు



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి తుహిన్ సిన్హా

ఎస్‌సి, ఎస్‌టి, పిఓఎ చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎస్సీ ఎస్టీ పిఓఎ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని సిబిడి విశాఖ రీజనల్ ఆఫీసర్ డాక్టర్ జి ప్రేమ కాజల్ అన్నారు. స్థానిక వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ సమావేశ మందిరంలో సిబిడి ఎస్పి ఎం నాగేంద్ర భూపాల్ పర్యవేక్షణలో సిఐ ఎం శేషు ఆధ్వర్యాన బుధవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎస్సీ అండ్ ఎస్టీ పిఓఏ చట్టం, కేసుల రిజిస్ట్రేషన్, ఇన్వెస్టిగేషన్, తీసుకోవలసిన జాగ్రత్తలు, ఎస్సీ ఎండ్ ఎస్టి పిఓఏ చట్టంలో బాధితుల నష్టపరిహారం, హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిఆర్‌ఓ దయానిధి, క్రైమ్ అడిషనల్ ఎస్పీ ఎల్.మోహన్‌రావు, సోషల్ వెల్ఫేర్ కార్యాలయ సూపరిం టెండెంట్ వరబాబు, అనకాపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంజెవిఎన్ కుమార్, దళిత మహిళ శక్తి జిల్లా అధ్యక్షురాలు జి మరియమ్మ, జిల్లా విజిలెన్స్ ఎండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రేబాక మధుబాబు, ఎస్సీ ఎస్టీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు బోని గణేష్, సిబిడి అనకాపల్లి డీఎస్పీ కుమార స్వామి, ఆదిత్య, హిమ శేఖర్, డివిఎన్ కాలేజీల విద్యార్థులు, వివిధ ఎన్జీవోస్ ఆర్గనైజేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండల పరిషత్ కార్యాలయంలోని సమాచార హక్కు చట్టం- 2005పై కసింకోట మండల, గ్రామస్థాయి అధికారులకు, ప్రజాప్రతినిధులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రవికుమార్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా తమకు కావలసిన సమాచారాన్ని పొందాలన్నారు. తహసిల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ చట్టం ముఖ్య ఉద్దేశాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న, ఎంపీపీ కలగ లక్ష్మి గున్నయ్య నాయుడు, జడ్పిటిసి శ్రీధర్ రాజు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి శ్రీనివాస్, నమ్మి మీనా గణేష్, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

మెగాస్టార్ ఫ్యాన్ టీజర్ రిలీజ్

ప్రజాశక్తి- అనకాపల్లి : క్రాంతి పిక్చర్స్ అధినేత నిర్మాణ సారథ్యంలో కిరణ్ వారియర్ దర్శకత్వం వహించిన మెగాస్టార్ ఫ్యాన్ చిత్రం డిసెంబర్ 13న విడుదలవుతున్న సందర్భంగా బుధవారం అనకాపల్లి రింగ్ రోడ్డు ఎన్టీఆర్ మార్కెట్లో నాగ దుర్గమ్మ జాతర మహోత్సవం సందర్భంగా నిర్వహించిన డ్యాన్స్ నైట్ కార్యక్రమంలో టీజర్‌ను రిలీజ్ చేశారు. అనకాపల్లి బిఆర్టి కాలనీ వాసి వర్ధమాన రచయిత విల్లూరి నవీన్ రచించిన ఐటెం సాంగ్‌ను బొడ్డేడ మురళి, మళ్ళ శ్రీనివాసరావు చిత్రం టీజర్‌ను పెంటకోట శ్రీనివాసరావు చేతుల మీదగా రిలీజ్ చేయడం జరిగింది. కార్యక్రమంలో యల్లపు త్రినాథ్, బొడ్డేడ శ్రీను, కాండ్రేగుల కూర్మారావు, కార్యక్రమం నిర్వాహకులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మెగాస్టార్ చిరంజీవి అభిమానులు

మద్యం షాపును తరలించాలి

ఎక్సైజ్ అధికారుల ఎదుట స్పష్టం చేసిన గోవాడ గ్రామస్తులు


ఎక్సైజ్ అధికారులతో మాట్లాడుతున్న గోవాడ గ్రామస్తులు

ప్రజాశక్తి-చోడవరం

మండలంలోని గోవాడ గ్రామం మధ్యలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తక్షణమే వేరే ప్రాంతానికి తరలించాలని గోవాడ గ్రామస్తులు కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్న నేపథ్యంలో బుధవారం చోడవరం ఎక్సైజ్ పోలీసులు బ్రాందీ షాపు వద్దకు వచ్చి పరిశీలించారు. అక్కడికి వచ్చిన పోలీసులను గ్రామస్తులు చుట్టుముట్టి తమ గ్రామంలో బ్రాందీ షాపు నిర్వహణ వద్దని, ఊరు పరిసర ప్రాంతాలకు మార్చాలని పట్టుపట్టారు. ఎక్సైజ్ సిఐ శేఖర్ ఈ విషయమై గురువారం నాడు గ్రామ పెద్దలు షాపు యజమాని ఎక్సైజ్ సిఐ ఆధ్వర్యంలో స్టేషన్లో సమావేశం ఏర్పాటు చేస్తున్నామని అక్కడికే రావాలని ఆందోళన చేస్తున్న వారిని ఆయన కోరారు. దీంతో ఆందోళన చేస్తున్న అల్లం రామప్పరావు, ఏడవక నూకరాజు, ఏడువాక శంకర్, వేపాడ అప్పారావు, కరణం శేఖర్, బండి బుజ్జి, బండి గోపి. ఏడివాక శ్రీను తాము స్టేషన్‌కి వస్తామని, షాపును అక్కడ నుండి తొలగించే వరకు ఊరుకునే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిఇఒను కలిసిన యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి నూతనంగా డిఈఓగా ఉద్యోగోన్నతిపై వచ్చిన గిడ్డి అప్పారావు నాయుడును బుధవారం యుటిఎఫ్ జిల్లా నేతలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను, విద్యాసంబంధమైన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, జిల్లా కార్యదర్శి జిఎస్ ప్రకాష్, రమేష్ రావు, సీనియర్ నాయకులు ఎల్లయ్య బాబు, ఎంవి అప్పారావు, శ్రీను బాబురావు, సతీష్, అక్కు నాయుడు, రాజు నాయుడు, దేవుడు నాయుడు, రవి, ఆశ, సలీం తదితరులు పాల్గొన్నారు.


డిఇఒకు పుష్పగుచ్ఛం అందజేసిన యుటిఎఫ్ నాయకులు

సేంద్రీయ ఎరువులు అందజేత

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని నాయుడుపాలెం గ్రామంలో 97 మంది రైతులతో 100 ఎకరాలలో రామ్‌కీ ఫౌండేషన్ ప్రయోగాత్మకంగా చేపడుతున్న సేంద్రీయ వ్యవసాయ ప్రాజెక్టులో భాగంగా సుమారు రెండు లక్షల రూపాయల విలువైన సేంద్రియ ఎరువులను బుధవారం అందజేశారు. రామ్ కి ఫౌండేషన్ వారు అందజేస్తున్న ఫసల్ అమృత్ ఎరువు ద్వారా 40 శాతం తక్కువ నీటితో 30 శాతం తక్కువ ఎరువుతో 30 శాతం అధిక దిగుబడి పొంది రైతు ఆదాయం పెరగడానికి అవకాశం ఉంటుందని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రీ సస్టైనబులిటీ హెచ్ ఆర్ బాలాజీ, రామ్‌కి ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్, మహిళా కోఆర్డినేటర్ రాజేశ్వరి, సర్పంచ్ వరలక్ష్మి, గ్రామ పెద్దలు సీతారామయ్య, శ్రీరామమూర్తి, ఉప సర్పంచ్ ఆర్ ముత్యాలు, వార్డు మెంబర్ మహాలక్ష్మి, రమాదేవి , గంగరాజు,సన్ని మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ మృతికి సిపిఎం సంతాపం

ప్రజాశక్తి-అనకాపల్లి : మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ మృతికి సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం బుధవారం ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపాన్ని, ఆయన కుటుంబీకులకు సానుభూతి తెలియజేశారు. మాడుగుల నియోజకవర్గం నుంచి ఐదుసార్లు వరుసగా ఎమ్మెల్యేగా గెలిచి, రెండుసార్లు మంత్రిగా పనిచేసిన సత్యనారాయణ నిరాడంబరత్వానికి నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. మాడుగుల నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేసి, నియోజకవర్గ ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్న సత్యనారాయణ మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఏపీ నేక్ ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాల కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌విఎస్ రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం కింద సర్వేయర్, ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో మూడు నెలల పాటు అందించే ఈ శిక్షణకు 15 నుంచి 45 సంవత్సరాల లోపు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా మాకవరపాలెం నేక్ శిక్షణ కేంద్రంలో జరిగే శిక్షణకు పాల్గొన్న వారికి ఉచితంగా స్టేషనరీ ఇచ్చి నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఉంటుందని, శిక్షణ అనంతరం ప్రైవేటు సెక్టార్లలో ఉపాధి కల్పించడం జరుగుతుందని తెలిపారు. శిక్షణకు ఎటువంటి రుసుము చెల్లించక్కర్లేదని, ఆసక్తి గల అభ్యర్థులు 7780374625, 7780275922 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ప్రజాశక్తి-చోడవరం : పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే బిఐటి2కె24 లక్ష్యమని ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ జె రమణాజీ అన్నారు. చోడవరంలో యువ పారిశ్రామికవేత్తలను తయారు చేయడంలో భాగంగా బుధవారం సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అడుగులు వేయాలని, అందుకు తగ్గ సూచనలు సలహాలు తాము అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా పారిశ్రామికరణకు సంబంధించి పలు నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉషోదయ కళాశాలల కరస్పాండెంట్ జె కృష్ణవేణి, డీన్ వెంకట వాసు, ప్రిన్సిపల్ నాయుడు పలువు, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదుకు కృషి చేయాలి


ప్రజాశక్తి- మునగపాక : టిడిపి సభ్యత్వ నమోదుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఎలమంచిలి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక పిఎసిఎస్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం టిడిపి ముఖ్య నాయకులు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలను, ఆశయాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి దాడి ముసలి నాయుడు, కష్టర్ ఇంచార్జ్ మొల్లేటి సత్యనారాయణ, రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి డొక్కా నాగభూషణం, గ్రామ శాఖ అధ్యక్షులు దాడి శివ, యూనిట్ ఇంచార్జ్ విల్లూరి నర్సింగరావు, దాడి అప్పలనాయుడు, పెంటకోట శ్రీరామ్ మూర్తి, వెలగా మురళి, బిలా లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

పలు షాపుల్లో తనిఖీలు

ప్రజాశక్తి-చోడవరం : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా బుధవారం కార్మిక, ఐసిడిఎస్, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో చోడవరం పట్టణంలోని పలు షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక శాఖ అధికారి పి సూర్యనారాయణ మాట్లాడుతూ షాపుల్లో ఎవరు బాల కార్మికులు పనిచేయలేదని తెలిపారు. తాము పరిశీలించిన రెండు షాపుల్లో పనిచేస్తున్న కార్మికులకు తక్కువ వేతనాలు ఇస్తున్నట్లు గుర్తించామన్నారు. వారిపై కేసులు నమోదు చేసి కనీస వేతనాలు అమలు అయ్యేలా చూస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో చోడవరం ఎస్ఐ జోగారావు, సీడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆర్గనైజర్ కనకరత్నం, పలువురు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శివాలయం నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-సబ్బవరం : మండల కేంద్రంలోని శివాలయం నిర్మాణానికి కార్తీక మాసం పురస్కరించుకొని సబ్బవరం మేజర్ పంచాయతీకి చెందిన శ్రీఉమా వాటర్ ప్లాంట్ అధినేత కోటాన సత్యం ఒక లక్ష నూట పదహారు రూపాయలు విరాళాన్ని బుధవారం ఆయల కమిటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో బర్ల రమణ, గెడ్డం కృష్ణ, దంగేటి నాని, దంగేటి ప్రకాష్, గెడ్డం రమణ, చింతల శ్రీను, కొల్లి కృష్ణ ,ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న యుటిఎఫ్ నేత భరత్‌కుమార్

కుసుమ హరనాథ్‌ను దర్శించుకున్న భరత్

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక గవరపాలెం కోటవీధి కుసుమ హరనాథ్ ఆలయ 29వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం అనకాపల్లి వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ కుసుమ హరనాథ్ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భరత్ కుమార్‌ని ఆలయ అధ్యక్షులు శ్రీరామదాసు వరాహ సత్యనారాయణ, బొడ్డేడ సన్యాసి నాయుడు దుస్సాలువతో సత్కరించారు. కార్యక్రమంలో గవర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, 80వ వార్డు వైసిపి ఇంచార్జ్ కెఎం.నాయుడు, నాయకులు నడిశెట్టి మధు, శ్రీధరాల మనోజ్ కుమార్, దొడ్డి హరి, రాపేటి మహాలక్ష్మినాయుడు, నిష్ఠల శ్రీనివాసరావు, కాండ్రేగుల రాము, కోన దుర్గా ప్రసాద్, మద్దాల శివనాయుడు, కాండ్రేగుల శ్యామ్, బుద్ధ నర్సింగరాజు, మునూరి శ్రీనివాసరావు, పీలా రాజు, తాతయ్య, రాయవరపు జోగిరాజు, కాండ్రేగుల శ్యామ్, బుద్ధ రాజు, పెట్ల నాగేశ్వరరావు, ఆడారి బుచ్చి రాము, పెంటకోట శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

బోరు తవ్వకం పనులు ప్రారంభం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని కేపీ అగ్రహారం గ్రామంలో వియ్యపు వారి కల్లాల వద్ద జడ్పిటిసి నిధులతో బుధవారం మంచినీటి బోరు తవ్వకం పనులను జడ్పిటిసి దొండ రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పిటిసి రాంబాబును రైతులు సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోపిశెట్టి శ్రీను, ఉప సర్పంచ్ డి ముసిలి నాయుడు గ్రామ రైతులు పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరుల వరి దుబ్బు ఉత్సవం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం రామాలయంలో శ్రీగౌరీ పరమేశ్వరుల ఉత్సవాల్లో భాగంగా వరి పొలంలో వరి దుబ్బుని గ్రామస్తులు తీసుకొచ్చి పూజలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ గల్లా రాజు, చిన్ని సన్యాసి నాయడు, మాజీ సర్పంచ్ చిన్ని వల్లభ నారాయణరావు, జనసేన నాయకులు కర్రి గోవింద, కర్రి లోవ రాజు, మాజీ ఉప సర్పంచ్ చిన్ని కోటేశ్వరరావు గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలో గల చిట్టయ్య పాలెం గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో టీవీ, దుస్తులు, రూ.50 వేలు నగదు కాలిపోయాయి. గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యులు ముచ్చకర్ల మాలినాయుడు ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో మంటలు చెలరేగి టీవీ కాలిపోయి మంటలు బీరువాకు వ్యాపించాయి. బీరువాలో బట్టలు 50000 నగదు కాలిపోయినట్లు బాధ్యతలు తెలిపారు

రేపు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి 11 కెవి లక్ష్మీ నారాయణ నగర్ ఫీడర్ లైన్‌లో చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో ఈనెల 8న పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 7 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు అనకాపల్లి స్టేషన్ రోడ్డు, తాకాసి వీధి, మల్ల వీధి, కోట్ని వీధి, గాంధీ బొమ్మ సెంటర్, చిన్న వీధి, పెరుగు బజార్ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని తెలిపారు.

గ్రీన్ అంబాసిడర్‌కు ఆర్థిక సహాయం

ప్రజాశక్తి -అనకాపల్లి : మండలంలోని రేబాక గ్రామ పంచాయతీ గ్రీన్ అంబాసిడర్‌గా పనిచేసిన అప్పారావు ప్రమాదంలో ఒక కాలు పూర్తిగా పోయింది. ఈ సందర్భంగా బుధవారం ఆయనకు రేబాక గ్రామ పంచాయతీ నిధులు నుండి 50 వేల రూపాయలు ఆర్థిక సహాయం జిల్లా పంచాయతీ అధికారి ఆర్ శిరీష రాణి, జిల్లా డిపిఆర్‌సి కోఆర్డినేటర్ నాగలక్ష్మి, సర్పంచ్ మాటూరు సన్యాసమ్మ చేతుల మీదుగా అందజేశారు.

పట్టణాభివృద్ధిపై జెడ్‌సి దృష్టి సారించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జీవీఎంసీ జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన బివి రమణను బుధవారం ప్రజా సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. అనకాపల్లి జోన్ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చిన్నియాదవ్, ఆళ్ళ ప్రవీణ్ కుమార్, బండి అప్పారావు, బొడ్డు సోమరాజు, ఆడారి బుచ్చిరాము, బొబ్బిలి గోవిందరాజులు, ముగడ అప్పారావు, పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

ప్రజాశక్తి-పరవాడ

మండలంలోని పెదముసిడివాడ గ్రామంలో తహశీల్దార్ ఎస్‌వి.అంబేద్కర్ ఆధ్వర్యాన బుధవారం జరిగిన రెవెన్యూ గ్రామసభలో గ్రామంలోని ప్రభుత్వ భూములను పరిరక్షించాలని పెదముసిడివాడ గ్రామానికి చెందిన బంధం వెంకటరమణ, బర్ల శంకర్రావు, బి.నానాజీ, ఈ.బోనంగి రెవెన్యూ కె.గొర్లివానిపాలెం గ్రామ నివాసి చిప్పాడ రామారావు వినతిపత్రాలు అందజేశారు. పెదముసిడివాడ రెవిన్యూ పరిధిలో గెడ్డవాగులు, ప్రభుత్వ భూములు, పంట కాలువలు, రోడ్లు, బందలు, రుద్ర భూములు, చెరువులు కబ్జాలకు గురైనట్లు వారు పేర్కొన్నారు. రీ సర్వేలో జరిగిన మోసాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

సబ్బవరం : మండలంలోని మొగలిపురంలో బుధవారం జరిగిన రెవిన్యూ సదస్సులో భూ రీ సర్వే సమస్యలపై 58 అర్జీలు అందినట్లు స్థానిక తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో రీ సర్వే డిటి గణేష్, మండల సర్వేయర్ అప్పారావు, విఆర్వో ఎస్.చల్లమాంబ, సర్పంచ్ గండి అరుణ, తమరాన బంగారునాయుడు, అంగటి నానాజీ, తమరాన సత్యనారాయణ, బైలపూడి రాంబాబు, సిరపరపు రాంబాబు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోట : మండలం అచ్చర్ల గ్రామంలో రీ సర్వేలో వచ్చిన భూ సమస్యపై గ్రామ సభ బుధవారం జరిగింది. రెవెన్యూ అధికారులు రైతుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. గ్రామసభలో రెవిన్యూ సీనియర్ అసిస్టెంట్ భాస్కర్‌రావు, విఆర్ఓ శ్రీనివాసరావు, గ్రామ టీడీపి అధ్యక్షులు నైనముశెట్టి రమణరావు, నిమ్మదల సన్యాసి నాయడు, వైసిపి నాయకులు నిమ్మదల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలోని వెల్లంకి గ్రామపంచాయతీలో బుధవారం నిర్వహించిన రీసర్వేపై రెవెన్యూ గ్రామసభకు 23 ఫిర్యాదులు వచ్చాయి. రీసర్వే డిటి గోవింద్, భీమిలి ఆర్‌డిఒ కార్యాలయ డిఐఒ కనకబాబు, మండల సర్వేయర్ అప్పన్న, వెల్లంకి విఆర్ఒ రామకృష్ణ స్థానిక సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. గ్రామంలో సర్వేనెంబర్ 278లో గెడ్డ వాగుకు చెందిన 40 ఎకరాలను బడాబాబులు బోర్లు, గెస్ట్ హౌసులు ఏర్పాటు చేసి కబ్జాకు పాల్పడ్డారని ఉపసర్పంచ్ కంచిబోయిన శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. నాయకులు చెన్నా నర్సింగరావు, చెన్నాసత్యం, పడాల రమణ, ప్రసాదరావు పట్నాయక్, తోనంగి అప్పారావు, తోనంగి రమణ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి : ఎంపిపి



మాట్లాడుతున్న ఎంపిపి కలగ లక్ష్మి

ప్రజాశక్తి-కశింకోట

పంచాయతీ ద్వారా గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్య నాయడు అన్నారు. స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. తహశీల్దారు అడబాల శ్రీనువాసరావు మాట్లాడుతూ గ్రామసభలు ద్వారా వచ్చి ఫిర్యాదులు పరిష్కారం చేస్తున్నట్లు చెప్పారు. జడ్పీటీసి దంతులూరి శ్రీధర్‌రాజు మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రోటోకాల్ ప్రకారం సర్పంచ్‌లు, ఎంపీటీసీలను పిలవాలని సూచించారు. ఉగ్గినిపాలెం గ్రామంలో కలప అక్రమ రవణా జరుగుతుందని, వన్య ప్రాణాలు వేటలపై ఫారెస్టు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యానవన శాఖ అధికారి లావణ్య మాట్లాడుతూ జీడీ, మామిడి తోటలకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిఉ పెంటకోట జ్యోతి శ్రీనివాసరావు, నమ్మి మీనా గణేష్, ఎంపీడీఓ వివి.రవికుమార్, సీడీపీఓ ప్రభావతి, ఏఓ స్వప్న, ఏపిఓ. శ్రీనివాసు, సర్పంచ్‌లు నిమ్మధల సోమేశ్వరరావు, వెన్నెల చిన దేముళ్ళు, కొప్పాక నాగమణి, కొన అరుణ నాగేశ్వరరావు, ఎంపీటీసీలు, వివిధ శాఖలు అధికారులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - చీడికాడ : రైతులకు ఖరీఫ్ సీజన్ పంట కోతకు దగ్గర పడటంతో మండలంలో పలుచోట్ల పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారిని రమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. బుధవారం చీడికాడ మండలంలో సిరిజం, కోణం గ్రామాలలో పొలం పిలస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి వ్యవసాయ సహాయ సంచాలకులు రవీంద్రనాథ్ హాజరై రైతులకు పంటల బీమాపై వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు కామేష్ , వర్మ పాల్గొన్నారు

యలమంచిలి : మండలంలోని రామారాయుడు గ్రామంలో బుధవారం 'పొలం పిలుస్తోంది రా' కార్యక్రమం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఈ ఏడాది వరి పంటకు ఎలుకలు ఎక్కువ నష్టం కలిగిస్తున్నాయని, వాటిని నిర్మూలించడానికి రైతులంతా ఐకమత్యంతో వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి పి.మోహనరావు, గొర్లె బాబూరావు, గొర్లె మురళి, వ్యవసాయ సహాయకులు అరుణ, దండి నూకునాయుడు, అంకిరెడ్డి నాగేశ్వరరావు, తదితర రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి : సిపిఎం

ప్రజాశక్తి-చోడవరం : విద్యుత్ స్మార్ట్ మీటర్లును ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో మొదటి స్మార్ట్ మీటర్ విశాఖలో ఏర్పాటు చేసి తర్వాత రాష్ట్రం మొత్తం అమలుకు ప్రభుత్వ పూనుకుందని తెలిపారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలుగొట్టాలని ఎన్నికల ముందు నారా లోకేష్ పిలుపునిచ్చారని, ఇప్పుడు అధికారంలోకి రాగానే శరవేగంగా స్మార్ట్‌మీటర్ల బిగింపునకు పూనుకున్నారని తెలిపారు. దీని వల్ల రీఛార్జ్ చేయకపోతే వెంటనే విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, ఇప్పటిలాగ కనీస గడువు ఉండదని పేర్కొన్నారు. మొదట వ్యవసాయ పంపుసెట్లకు మాత్రమే బిగిస్తామని చెప్పారని, ఇప్పుడు గృహాలకు బిగిస్తున్నారని తెలిపారు. ఎన్నికల ముందు విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన కూటమి పార్టీలు అదానీ కంపెనీకి లబ్ధిచేకూర్చడానికి ఇప్పుడు యుద్ధ ప్రాతిపదికన బిగించడానికి సిద్ధమవౌతున్నారని తెలిపారు. వీటిని ప్రజలు వ్యతిరేకించాలని కోరారు.

జీతాలకు ముఖ ఆధారిత హాజరు లింక్ చేయడం తగదు

ప్రజాశక్తి -కశింకోట : ముఖ ఆధారిత హాజరును ఎపి వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల జీతాలకు లింక్ చేయడం సరికాదని తెలుగునాడు ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యాక్షులు ఎంఎస్‌వి.ప్రసాద్, జిల్లా అధ్యక్షులు పాతాల రామారావు, కార్యదర్శి కెఎస్‌ఆర్‌కెజి.నర్సింహరావు పేర్కొన్నారు. మండలంలోని తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వారు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర అధికారులు అత్యుత్సాహంతో ఏ ప్రభుత్వ శాఖలో లేని ఈఎఫ్‌ఆర్‌ఎస్‌ను జీతాలకు లింక్ చేయడం దారుణమన్నారు. ఉద్యోగులను కేవలం ఉదయం 9 నుండి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే పని చేయడం లేదని, అత్యవసర సమాయంలో అదనపు సమయం పని చేస్తున్నారని, కొన్ని సందర్భాల్లో ఉదయం 6 నుండి సాయంత్రం 6 గంటల వరకు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆ సమయంలో అదనపు జీతం ఇస్తారా అని అధికార్లను ప్రశ్నిస్తున్నారు. తక్షణమే ఈ పద్ధతి మార్చుకోవాలని కోరారు.

ప్రభుత్వ ఆసుపత్రుల కార్మికులకు జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి-చోడవరం : జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, ఫెస్ట్ కంట్రోల్ కార్మికులకు బకాయి పడ్డ జీతాలు తక్షణమే చెల్లించాలని ఎపి మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఉమ్మడి విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జీవో ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని, పిఎఫ్, ఈఎస్ఐ డబ్బులు తినేస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకొని, వారి కాంట్రాక్ట్ లైన్స్ రద్దు చేయాలని కోరారు. కార్యక్రమం లోకోటి శ్వరరావు, కుమారి, లక్ష్మి, నూకరాజు, నూక రత్నం పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని జీవీఎంసీ 88వ వార్డు పరిధిలో సుమారు మూడు కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులకు పెందుర్తి శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు బుధవారం శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంగినారపాడు, అజనగిరి కాలనీ, జీవీఎంసీ శెట్టివానిపాలెం, వెదుళ్ళ నరవ, కొత్తూరు, కొత్తూరు, సత్తివానిపాలెం, నరవ తదితర గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రెయినేజీలు, కల్వర్టులు నిర్మాణం చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు, కూటమి నాయకులు ఇందల వెంకటరమణ, బలిరెడ్డి అప్పారావు, ఒబ్బిన శ్రీకాంత్, గొంతుకోరు శివ, గవర సత్తిబాబు, ఇల్లపు శ్రీనివాసరావు, రాజాన పైడిరాజు, ఓమ్మి సత్యం, చల్లా శ్రీను, సూరిబాబు, శివ, శ్రీనివాసరావు, టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైవాడ జలాశయంలో చేప పిల్లలు విడుదల

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని రైవాడ జలాశయంలో మత్స్యశాఖ అధికారులు 4 లక్షల చేప పిల్లలను బుధవారం విడుదల చేశారు. జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, మత్స్య శాఖ కమిషనర్, స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచనల మేరకు జిల్లా మత్స్యశాఖ అధికారి పి.ప్రసాద్ ఆధ్వర్యంలో చేప పిల్లలు విడుదల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ చేపల వేటకు అనుమతి పొందిన వారు మాత్రమే 6 నెలల తర్వాత చేపలు పట్టుకోవాలని సూచించారు. అనధికార వేటను కొనసాగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ప్రైవేట్ దళారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం డిడి నిర్మలకుమారి, ఎఫ్డిఓ టి.నాగమణి, తహసీల్దార్ పీ.లక్ష్మీదేవి, ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మీ, జడ్పిటిసి కర్రీ సత్యం, వైస్ ఎంపీపీ గంగాభవాని, సర్పంచ్ చల్లా లక్ష్మీనాయుడు, టిడిపి నాయకులు చల్లా నానాజీ, చల్లా తాతయ్యలు, మొసలి పైడిరాజు, మొసలి తమ్మయ్య, శ్రీను, చంటి, వంతు నాయుడు, సింహాచలం, మత్స్యశాఖ అధికారి కీర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అమృతపురం గ్రామంలో జిల్లా పశుగాణాభివృద్ధి సంస్థ సౌజన్యంతో ఉచిత పశుగర్భకోస చికిత్స శిబిరం, పాడి రైతులకు అవగాహనా సదస్సు బుధవారం నిర్వహించారు. సర్పంచ్ బైలపూడి గౌరీరామారావు, ఎంపీటీసీ సింగంపల్లి శ్రీనివాసరావు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. పశువులకి చికిత్స చేసి, పశు పోషణపై అవగాహన కల్పించారు. ఈ 62 పశువులుకు గర్భకోస చికిత్సలు, 32 పెయ్యలకు నట్టల నివారణ మందులు వేశారు. 2 ఆవులకు మందగుది శస్త్ర చికిత్స చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గండి ముత్యాలనాయుడు, బొకం స్వామి నాయుడు, బొకం కాసుబాబు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి .రామ్మోహన్‌రావు , జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహణ అధికారి బి.ప్రసాద్‌రావు, సబ్బవరం సహాయ సంచాలకలు కే.ఉష కుమారి, పి.భానుబాబు, జిల్లా డిఎల్‌డిఎ డాక్టర్ ఎస్.సౌజన్య, అంతకాపల్లి డాక్టర్ జి.అరుణ, ఎస్. స్వర్ణలత, బి.సంధ్య, ఆశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నర్సీపట్నంలో హై టెన్షన్

-వైసిపి ర్యాలీ అడ్డగింత
- మాజీ ఎమ్మెల్యే గణేష్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు



ర్యాలీని అడ్డగిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ఇసుక రీచ్ నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు ఇసుక తరలింపు, అక్రమ కేసులపై నర్సీపట్నం రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట బుధవారం ధర్నా చేయాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన ఉద్యమాన్ని పోలీసులు భగ్నం చేశారు. నర్సీపట్నం మండలం గబ్బాడలో ఉన్న ఇసుక రీచ్ నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రెండు లారీలను అడ్డుకున్న నేపథ్యంలో రూరల్ పోలీసులు కేసులు పెట్టారు. ఈ అక్రమ కేసులు నిరసనగా రూరల్ సిఐ రేవతమ్మ వైఖరికి నిరసగా మాజీ ఎమ్మెల్యే గణేష్ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాకు పిలుపునిచ్చారు. ఈ ధర్నాకు అనుమతి లేదని. నర్సీపట్నం డిఎస్పీ మోహన్ ముందే ప్రకటించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ధర్నా నేపథ్యంలో 30 యాక్టును పోలీసులు బుధవారం పట్టణంలో అమల్లోకి తీసుకొచ్చారు. మంగళవారం రాత్రి నుంచి నర్సీపట్నం నియోజకవర్గం పరిధిలోని కీలకమైన నాయకులు, కార్యకర్తలను అదుపులో తీసుకున్నారు. ముందుగానే కొంత మంది నాయకులు, కార్యకర్తలు నర్సీపట్నంలోని ఎమ్మెల్యే ఇంటికి మంగళవారం రాత్రే చేరుకున్నారు. వీరందరు వెంట రాగా మాజీ ఎమ్మెల్యే గణేష్ రూరల్ పోలీస స్టేషన్కు ర్యాలీగా బయలుదేరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి అరకిలో మీటరు దూరంలోని గురుకుల పాఠశాల వద్ద పెద్ద సంఖ్యలో మొహరించిన పోలీసులు ర్యాలీని అడ్డుకున్నారు. దీంతో, పోలీసులకు, నాయకులకు మధ్య వాగ్వివాదం జరిగింది. ఇసుక దొంగలపై ఫిర్యాదు చేసిన తమ పార్టీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి రూరల్ సీఐ టీడీపీ కార్యకర్తలా పని చేస్తున్నారని, ఆమె వ్యవహార్శైలిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలనే ఉద్దేశ్యంతోనే ధర్నా చేస్తున్నామని మాజీ ఎమ్మెల్యే వాదించారు. కొద్ది సేపు వివాదం తర్వాత గణేషును అదుపులో తీసుకొని పోలీస్ స్టేషన్కు తరలించారు.



మాట్లాడుతున్న గణేష్

పోలీసుల అదుపులో వైసిపి నేతలు

కోటవురట్ల: నర్సీపట్నంలో వైసీపీ నాయకుల అరెస్టులకు నిరసనగా వైసిపి నాయకులు నర్సీపట్నంలో మాజీ ఎమ్మెల్యే పెట్ల గణేష్ చేపడుతున్న ర్యాలీ సందర్భంగా వివిధ మండలాలకు చెందిన వైసిపి నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు ఇందులో భాగంగా మాకవరపాలెం నాతవరం మండలాలకు సంబంధించిన వైసీపీ నాయకులు 21 మందిని కోటవురట్ల పోలీస్ స్టేషన్కు తరలించారు

మాజీ ఎమ్మెల్యే గణేష్‌కు బూడి సంఘీభావం

ప్రజాశక్తి-కశింకోట : నర్సీపట్నంలో అరెస్టు చేసి కశింకోట పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చిన నర్సీపట్నం మాజీ శాసన సభ్యులు పెట్ల ఉమా శంకర్ గణేష్‌ను కశింకోట పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఉప ముఖ్యమంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు బూడి ముత్యాలనాయుడు కలిసి సంఘీభావం తెలియజేశారు. నర్సీపట్నం పరిధిలో కంటేనైర్ లారీల్లో ఇసుక అక్రమంగా రవాణా అవుతుందని ఆరోపిస్తూ మాజీ ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్ బుధవారం నర్సీపట్నం పోలీస్ స్టేషన్ వద్ద ధర్నాకు దిగారు. దీంతో పోలీసులు గణేష్‌ను, వైసిపి నాయకులు మాకిరెడ్డి బుల్లిదొర, ఏకా శివ ప్రసాద్, చింతకాయల వరుణ్ తదితరులను అరెస్టు చేసి కశింకోట పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. దీంతో బూడి ముత్యాలనాయుడు, వైసిపి అనకాపల్లి నియోజకవర్గం సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ స్టేషన్‌కు వచ్చి మద్దతు తెలిపారు.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

శ్రీ ప్రకాష్‌లో ఉత్సాహంగా రిమ్-జిమ్

ప్రజాశక్తి -నక్కపల్లి: పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలో రిమ్ జిమ్ -2024 పోటీలు ఉత్సాహంగా ఉల్లాసంగా జరుగుతున్నాయని విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, ఈ పోటీలలో శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల తుని, పాయకరావుపేట, అన్నవరం శాఖల విద్యార్థులు సుమారు 4500 మంది పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సాహిత్యం, సంగీతం, ఆటలు, లలిత కళలు, థియేటర్ ఆర్ట్స్, సైన్స్ వంటి అనేక అంశాలపై జూనియర్, సబ్ జూనియర్, సీనియర్, సూపర్ సీనియర్ విభాగాలలో 29 రకాల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వెలికి తీసేందుకు ప్రతీ సంవత్సరం ఈ పోటీలను నిర్వహిస్తున్నామని, రిమ్ జిమ్ ముగింపు కార్యక్రమం ఈ నెల 9 న జరుగుతుందని సిహెచ్. విజయ్ ప్రకాష్ వెల్లడించారు.

రీ సర్వే సమస్యలను పరిష్కరిస్తాం

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని రీ సర్వే జరిగిన గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి, ఈ నెలాఖరు నాటికి పరిష్కరిస్తామని తహసిల్దార్ నరసింహమూర్తి తెలియజేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని రీ సర్వే జరిగిన గ్రామాల్లో అక్టోబర్ 17వ తేదీ నుండి నవంబర్ 5వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించడం జరిగిందన్నారు. మొత్తం 380 అర్జీలు వచ్చాయని వాటిలో 342 రీ సర్వేకు సంబంధించిన పిటీషన్లు రాగా, ఇతర సమస్యలపై 48 అర్జీలు వచ్చాయన్నారు. వచ్చిన అర్జీలు విచారణ చేపట్టి పరిష్కారం చేపడతామన్నారు.

డిపోను తనిఖీ చేసిన జిల్లా ప్రజా రవాణా అధికారి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్థానిక ఆర్టీసీ డిపోను జిల్లా ప్రజా రవాణా అధికారి కె.పద్మావతి బుధవారం తనిఖీ చేశారు. ఈ తనిలో భాగంగా డిపో విభాగాలలో ట్రాఫిక్, గ్యారేజ్ సూపర్వైజర్లతో సమావేశం నిర్వహించారు. వారి వారి విభాగాలలో తీసుకోవలసిన జాగ్రత్తలు సూచించారు. డ్రైవర్ల నుండి బస్సులకు సంబంధించిన ప్రతీ నెల మొదటి వారంలో 1,2,3 వ తేదీలలో డ్రైవర్ల నుండి బస్సుల సాంకేతిక పరమైన లోపాలను సేకరించి 7వ తేదీలోగా వాటిని పూర్తిస్థాయిలో సరిచేస్తామన్నారు. గ్యారేజ్ సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ సమావేశం లో నర్సీపట్నం డిపో అసిస్టెంట్ ఇంజనీర్(మెకానికల్) పి.ఆచారి, ట్రాఫిక్ ఇన్చార్జి ఎంఎన్.మోహనరావు, అనకాపల్లి డిపో అసిస్టెంట్ ఇంజనీర్ పి.మల్లేశ్వరరావు, ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ వై.రవిచంద్ర, పాల్గొన్నారు.

23 నుండి నీటి సంఘం ఎన్నికలు

ప్రజాశక్తి-రోలుగుంట: ఈ నెల 23 నుండి మూడు రోజుల పాటు నీటి సంఘం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు కొత్తకోట సెక్షన్ ఇరిగేషన్ ఏఈ సూర్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 10 చెరువులకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొమిరవోలు, అనిమిరెడ్డివానిచెరువు, కైసర్లవానిచెరువు, తిమ్మరాజు, పోతలవానిచెరువు, దొరచెరువు, పినపోతుల వాని చెరువు, కనుమల చెరువు, గుండుబాడు గెడ్డకు ఎన్నికలు జరగనున్నాయన్నారు.

'మాజీ ఎమ్మెల్యేను అరెస్టు చేయాలి'

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: వైసీపీ హయాంలో గబ్బాడ ఇసుక రీచ్లో వేల టన్నుల ఇసుకను దోచుకుతిన్న మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉ మాశంకర్ గణేష్ ను అరెస్టు చేయాలని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఆయకు ఏమీ తెలియదన్నట్లు శాంతియుత ధర్నాలు చేపట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజలను మభ్యపెట్టే విధంగా మాజీ ఎమ్మెల్యే గణేష్ ప్రవర్తిస్తున్నారన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాల మేరకు మైనింగ్, రెవెన్యూ అధికారులు విచారణ చేస్తే అక్రమ ఇసుక ఉందని గుర్తించడం జరిగిందన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

విద్యార్థులకు టీకాలు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం మానవ సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్ వేశారు. 364 మంది విద్యార్థులకు మూడవ విడత వ్యాక్సినేషన్ పూర్తి చేసినట్లు వైద్యులు వెల్లడించారు. ఈ వ్యాక్సిన్ ద్వారా విద్యార్థుల్లో గర్భస్థ, సర్వైకల్ క్యాన్సర్ నివారణ సాధ్యమవుతుందని తెలిపారు.విద్యార్థులకు వైద్య సేవలు అందించినందుకు గాను మానవసేవ ట్రస్ట్ ప్రతినిధులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ములుపూరి మూర్తి రాజు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో హెూమీబాబా క్యాన్సర్ ఆసుపత్రి పూర్వ డైరెక్టర్ డాక్టర్ దిగుమర్తి రఘునాథ్‌రావు, డాక్టర్ లీల, వైద్య బృదం, పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ కమిడి బాబురావు, గ్రామ పెద్దలు అయినంపూడి అప్పలరాజు, మణి రాజు, పాఠశాల పూర్వ ప్రధాన ఉపాధ్యాయులు కోడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పొగాకుతో ప్రమాదకర వ్యాధులు

ప్రజాశక్తి-గొలుగొండ: పొగాకు రహిత సమాజాన్ని తీర్చిదిద్దాలని కృష్ణదేవిపేట పీహెచ్‌సి వైద్యాధికారి హరిప్రవీణ్ అన్నారు. బుధవారం పీహెచ్‌సి ఆవరణలో పొగాకు రహిత ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ, పొగాకుతో క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. పొగాకుకు అందరూ దూరంగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాపోరును జయప్రదం చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి -చీడికాడ: రాష్ట్రంలో జరుగుతున్న దళితులపై అత్యాచారాలు, పెరుగుతున్న అధిక ధరల, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 8 నుండి 14 వరకు రాష్ట్రవ్యాపితంగా ప్రజా పోరు పేరుతో ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహిస్తామని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శంకర్‌రావు తెలిపారు. మండల కార్యదర్శి ఆర్ దేముడు నాయుడు ఆధ్వర్యం లో బుధవారం పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈనెల 14న సచివాలయాల వద్ద, 15న మండల కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహిస్తామన్నారు.నిత్యావసర వస్తువులు, వంటనూనెలు, కూరగాయల ధరలు ఆకాశనంటుతున్నాయన్నారు. రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులను సరసమైన ధరలకు అందించాలని డిమాండ్ చేశారు. మహిళలు, పిల్లలపై, దళితులపై అత్యాచారాలు రోజురోజుకు పెరుగుతున్నాయని తెలిపారు. గత ప్రభుత్వానికి భిన్నమైన పాలన అందిస్తామన్న కూటమి వాగ్దానాలు ఎక్కడా కనిపించ లేదని విమర్శించారు. ఉచిత ఇసుక విధానం నేటికీ అమల్లోకి రాలేదన్నారు.. దీంతో భవన నిర్మాణ కార్మికులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.విద్యుత్ ఛార్జీలు పెంచబోమంటూనే ట్రూ అప్ ఛార్జీల పేరుతో భారాన్ని ప్రజలపై వేయడాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు.వైరల్ జ్వరాలకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ శ్రీనివాసరావు, ఈశ్వరరావు, రమణ, కన్నబాబు పాల్గొన్నారు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నేతలు

జీడితోటలకు బీమా పథకం అమలుకు చర్యలు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో రైతాంగం సాగు చేస్తున్న జీడి తోటలకు స్వచ్ఛంద బీమా పథకాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని గొలుగొండ మండల ఉద్యాన అధికారి ఎస్ శిరీష తెలిపారు. బుధవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ప్రభుత్వం 2024-25లో ఈ పథకాన్ని అమలు చేసేందుకు సిద్ధమైందన్నారు. రబీ సీజన్ లో అధిక వర్షాలు, అకాల వర్షాలు, అధిక తేమ ఉష్ణోగ్రతల కారణంగా దెబ్బతిన్న తోటలకు ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు. ఎకరం విస్తీర్ణంలో దెబ్బతిన్న జీడి తోటలకు రూ.30800 బీమా లభిస్తుందన్నారు. రైతు ఎకరానికి ప్రీమియం కింద రూ.1,540 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ ప్రీమియం అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్ (ఏఐసి)కి ఈనెల 15లోగా చెల్లించాలని పేర్కొన్నారు. జీడి పంటలపై బ్యాంకులో రుణం పొందిన రైతులు స్వచ్ఛంద డిక్లరేషన్ సమర్పిస్తే సరిపోతుందన్నారు. బ్యాంక్ రుణాలు పొందని రైతులు పిఎసిఎస్, బ్యాంకు అధికారులు, ఏఐసీ కంపెనీ ఇంచార్జ్ వి.దుర్గా మోహన్ (8886929474), ఫీల్డ్ కోఆర్డినేటర్ ను సంప్రదించవచ్చునన్నారు. గ్రామ సచివాలయం, నేషనల్ కార్పొరేషన్ ఇన్సూరెన్స్ పోర్టల్, (ఎన్.సి.ఐ.పి) ద్వారా కూడా రైతులు నేరుగా తమ ప్రీమియంను చెల్లించవచ్చని తెలిపారు. ఈ పథకాన్ని పొందేందుకు ఆధార్ కార్డు, భూమి పత్రాలు, పంట సాగు ధృవీకరణ పత్రాలు, బ్యాంక్ పాస్ బుక్, ఫోన్ నెంబర్లతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆశా కార్యకర్తలకు శిక్షణ

ప్రజాశక్తి-గొలుగొండ: జాతీయ ఆయుష్ మిషన్ ప్రోగ్రాంపై కృష్ణదేవిపేట పీహెచ్‌సి పరిధిలోని ఆశా కార్యకర్తలకు బుధవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జాతీయ ఆయుష్ మిషన్ ప్రోగ్రామ్ ట్రైనింగ్ డాక్టర్ కళావతి ఆయుష్ వైద్యం ద్వారా ఆరోగ్య పరిరక్షణ, సాధారణ వ్యాధులతో పాటు మధుమేహం నియంత్రణపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సి డాక్టర్ హరిప్రవీణ్, ఆశ కార్యక్తలు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌పీఎస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యులు

బిఎన్ రోడ్డు మరమ్మతు చేపట్టాలి

-సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న



మాట్లాడుతున్న వెంకన్న

ప్రజాశక్తి-కొత్తకోట:సిపిఎం రావికమతం, రోలుగుంట ఏరియా కమిటీ సమావేశం బుధవారం రావికమతం మండలం కొత్తకోట రవి కళ్యాణ మండపంలో నిర్వహించారు. పాంగి చంద్రయ్య, ఈరెల్లి చిరంజీవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న మాట్లాడుతూ, నర్సీపట్నం - చోడవరం (బియన్) రోడ్డు కు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. రావికమతం మండల కేంద్రంలో ఆర్టీసీ కాంప్లెక్స్ భవనా లు ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు. గిరిజన భూములను గిరిజనేతరులకు పట్టాలు ఇచ్చిన రెవిన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీ ఆధునీకరణకు నిధులు కేటాయించాలని, ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు, మండల కమిటీ సభ్యులు సోలం రాజు, గేమిల వాసు, సిహెచ్ సూరిబాబు, రోలుగుంట మండల నేత శ్రీను పాల్గొన్నారు.

బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్న విశాఖ బాలోత్సవం పోస్టర్‌ను వియంఆర్‌డిఎ కమిషనర్ ఛాంబర్‌లో బుధవారం కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలోత్సవ కార్యక్రమ వివరాలను కమిషనర్‌కు విశాఖ బాలోత్సవం ప్రధాన కార్యదర్శి జి.ఎస్.రాజేశ్వరరావు వివరించారు. విశాఖ బాలోత్సవాన్ని సెయింట్ ఆంథోనీ ప్రైమరీ స్కూల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే స్కూళ్లకు వెళ్లి పోటీల వివరాలున్న సెట్లను అందించామని, ఈ నెల 9వ తేదీలోగా ఎంట్రీలను బాలోత్సవ కేంద్రానికి అందించాలని స్కూళ్లను కోరినట్లు చెప్పారు. పెందుర్తి నుంచి ఎన్ఎడి కొత్త రోడ్డు వరకూ ఉన్న స్కూళ్ళ పిల్లలకు డిసెంబర్‌లో వేరుగా నిర్వహిస్తామని తెలిపారు. బాలోత్సవం విజయవంతం కావడానికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరరావుతో బాటు విశాఖ బాలోత్సవం అధ్యక్షులు పి.రఘు, కమిటీ సభ్యులు సిహెచ్.సత్యనారాయణ, పి.లచ్చిరాజు పాల్గొన్నారు.

పశుగణనను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - చీడికాడ: ప్రస్తుతం జరుగుతున్న 21వ పశు గణనను వినియోగించుకోవాలని పశువైద్య సంచాలకులు చిట్టినాయుడు కోరారు. మండలం లోని తురువోలులో 21వ పశు గణన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమం ఫిబ్రవరి నెల వరకు మండలంలోని అన్ని గ్రామాలలో జరుగుతుందని, ప్రజలు పశు సంపద వివరాలు పశు సంవర్ధక శాఖ సిబ్బందికి అందించి సహకరించాలని, ఈ అవకాశాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని సూచించారు. పశు గణన పైనే ఆధారపడి రానున్న రోజులలో ఉచిత టీకాలు, మందులు, పశు సంవర్ధక శాఖ పథకాలు ప్రజలకు అందించడం జరుగుతుందని తెలియజేశారు. అనంతరం పెదగోగాడ , చీడికాడ పశు వైద్య శాలల్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు.ఈ కార్యక్రమంలో పశువైద్య సహాయకులు పాల్గొన్నారు

నేటి నుంచి విశాఖలో ఐసికాన్ జాతీయ సదస్సు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖలో ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు ఐసికాన్ జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు సదస్సు కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కె.ఎ.వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. కెజిహెచ్ సూపర్ స్పెషాలిటీ బ్లాకులో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సదస్సు తొలి రోజైన గురువారం పీజీలకు జరిగే వర్క్ షాపులో మధుమేహం తదితర అంశాలపై సెషన్ ఉంటుందన్నారు. శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు జరిగే ప్రారంభోత్సవంలో మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పాల్గొంటారని చెప్పారు. శనివారం ఉదయం 6 గంటలకు ఆర్.కె.బీచ్‌లో వాక్‌థాన్ ఉంటుందని తెలిపారు.

సదస్సు చైర్మన్ డాక్టర్ కె.దిలీప్‌కుమార్ మాట్లాడుతూ, సుగర్, థైరాయిడ్, మెడ వద్ద వాపు, లింగధారణ వ్యాధులు, ఎముకల క్షీణతపై ఇటీవల వచ్చిన ఆధునిక చికిత్స గురించి చర్చిస్తారన్నారు. సదస్సు సైంటిఫిక్ చైర్మన్ డాక్టర్ ఎం.మైథిలి మాట్లాడుతూ, మూడు రోజుల పాటు జరిగే సదస్సులో పలు అంశాలు మీద 250 మంది వైద్యులు ఫ్యాకల్టీగానూ, 200 మంది ప్రతినిధులు పాల్గొంటారని వివరించారు. అమెరికా, యుకె, నేపాల్, ఇండోనేషియా, దుబాయ్, శ్రీలంక నుండి ఎండోక్రైనాలజీ వక్తలు హాజరు కానున్నట్లు తెలిపారు.

ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: ఎన్నికలలో టీడీపీ కూటమి హామీ ఇచ్చిన విధంగా ఉచిత ఇసుకను తక్షణం అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మికసంఘం (ఏఐటియుసి) జిల్లా అధ్యక్షులు ఎల్. వి రమణ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్మికులతో కలిసి ఈనెల 11న భవననిర్మాణ కార్మికులు చేపట్టనున్న ఆందోళన సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్తగా ఏర్పడిన టీడీపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఉచిత ఇసుక హామీని తక్షణం అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణ రంగాన్ని కుదేలు చేసిందన్నారు. సంఘం జిల్లాప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ మాట్లాడారు.

విసిసి బాలల దినోత్సవం పోస్టర్ విడుదల



పోస్టర్‌ను విడుదలచేస్తున్న వినయ్‌గాంధీ, రమాప్రభ తదితరులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఇంటరాక్ట్ క్లబ్స్ ఆఫ్ విసిసి బాలల దినోత్సవం- 2024 పోస్టర్‌ను బుధవారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ విశాఖపట్నం ప్రెసిడెంట్ వినయ్ గాంధీ మాట్లాడుతూ, వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్, రోటరీ క్లబ్ సంయుక్తంగా ఏర్పాటుచేసిన ఇంటరాక్ట్ క్లబ్స్‌లో ఈ సంవత్సరం జిల్లా వ్యాప్తంగా ఉన్న 135 కేంద్రాల్లో బాలల దినోత్సవం -2024 పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ ఇంటరాక్ట్ వీక్ సందర్భంగా బాలల దినోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇవి ఈ నెల 4న ప్రారంభమై బాలల దినోత్సవమైన 14వ తేదీ వరకు జరుగుతాయని చెప్పారు. ఈ సంవత్సరం "సర్వీస్ అబౌ సెల్ఫ్" అనే థీమ్‌తో క్లబ్ లీడర్లు, వాలంటీర్ల పిల్లల కోసం అనేక కార్యక్రమాలను రూపొందించినట్లు తెలిపారు.

విసిసి వ్యవస్థాపకులు డాక్టర్ కె.రమాప్రభ మాట్లాడుతూ, బాల్యం చాలా విలువైనదని, అది పిల్లలకు అందించేందుకు వారు సమిష్టిగా నిర్వహించే కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఏలా బాలల దినోత్సవాన్ని వేలాదిమందితో నిర్వహిస్తున్నామని తెలిపారు. దీని ద్వారా ఒకే ప్రాంతంలో ఉన్న పిల్లల మధ్య స్నేహం, పరస్పర సహకారం, సేవా భావం, తద్వారా వారిలో నాయకత్వ లక్షణాలు పెరుగుతున్నాయని చెప్పారు. సెలబ్రేటింగ్ ది జాయ్ ఆఫ్ చైల్డ్ హుడ్ అనే నినాదంతో బాలలలో శారీరక, మానసిక ధారుడ్యాన్ని పెంచే క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వయసు వారీగా సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్‌కు ఆసక్తిని బట్టి విడివిడిగా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏదైనా ప్రాంతంలో బాలల దినోత్సవం పోటీలు నిర్వహించాలనుకునే వారికి బహుమతులు, సర్టిఫికెట్స్ అందిస్తామని చెప్పారు. వివరాలకు 9347205549, 9392993742 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎల్లాజీ, సునీత, భవాని, మణి, పాల్గొన్నారు.


4మాట్లాడుతున్న ఎంపిడీవో సీతారామరాజు

పక్కాగా సోషల్ ఆడిట్ తనిఖీలు చేపట్టాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని సోషల్ ఆడిట్ తనిఖీలు పక్కాగా చేపట్టాలని ఎంపిడీవో డి సీతారామరాజు, ఉపాధి హామీ పథకం అధికారులు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం విఆర్‌పిలు, పంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎటువంటి అవినీతి, అక్రమాలకు తావు లేకుండా తనిఖీలు నిర్వహించాలన్నారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి రికార్డులను సోషల్ ఆడిట్ సిబ్బందికి అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి నానాజీ, ఎస్ఆర్‌పి నాగరాజు, ఈఓపిఆర్డి ఎం శ్రీను, ఏపీవోలు భాగ్యలత, ఈశ్వరరావు, హౌసింగ్ ఏఈ జగన్, డిఆర్‌పిలు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు

ప్రజాశక్తి -రోలుగుంట:ఎంకె పట్నం పంచాయతీ కొరుప్రోలు గ్రామానికి 3.5 కిలోమీటర్ల రోడ్డుకు కోటి 50 లక్షల నిధులను మంజూరు చేశారు. ఈ మేరకు చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కక్షపూరితంగానే శిలాఫలకాన్ని ధ్వంసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు మాసాల్లో అభివృద్ధిని చూసి ఓర్వలేక ఇలాంటి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రతిపక్షం నాయకులు చేసిందనడానికి ఇదే నిదర్శనమన్నారు. మండల టిడిపి పార్టీ అధ్యక్షులు చంద్రమౌళి, స్థానిక టిడిపి సీనియర్ నాయకుడు మద్దు పైడితల్లి నాయుడు, రొంగలి గంగరాజు, మాకిరెడ్డి శ్రీను, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రూ అప్ ఛార్జీలు రద్దు చెయ్యాలి

-వార్వా, నివాస్ విజ్ఞప్తి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర ప్రజలపై రూ.14 వేల కోట్లకుపైగా ట్రూఅప్ ఛార్జీలు, ఫ్యూయల్ సర్దుబాటు ఛార్జీలు బాధడం సరికాదని, వీటిని రద్దు చేయాలని వార్వా ప్రధాన కార్యదర్శి బి.బి.గణేష్, నివాస్ ప్రధాన కార్యదర్శి పిట్టా నారాయణమూర్తి ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. 2022-23 సంవత్సరానికి రూ.6072 కోట్లు ట్రూ అప్ ఛార్జీలు వసూలు చెయ్యాలని ఎపిఇఆర్‌సి ఉత్తర్వులు జారీ చేసిందని, 2023-24 సంవత్సరానికి ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జస్ట్‌మెంట్ (ఎఫ్‌పిపిసిఎ) కోసం రూ.8126 కోట్లు వసూలు చేసుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ విద్యుత్ పంపిణీ సంస్థలు డిస్కమ్‌లు ఎపిఇఆర్‌సికి మరలా ప్రతిపాదనలు పంపించాయని తెలిపారు. ఇంతకు ముందు నుంచే ఒక ఎఫ్ పిపిసిఎ నెల నెలా విద్యుత్ బిల్లులో వసూలు జరుగుతూనే ఉందని, ఇప్పుడు మరో రెండు ఛార్జీలు బిల్లులో కలుస్తాయని తెలిపారు. ఇలా విద్యుత్ ఛార్జీలు ప్రజల నడ్డి విరుస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. వీటికి అంతం ఉందా అని ప్రశ్నించారు. జరిగి పోయిన సంవత్సరాలకి ఛార్జీలు చెల్లించేశామని, కానీ పంపిణీ సంస్థలు చేసే అవకతవకలకు, ప్రైవేటు జనరేషన్ కంపెనీలకు లాభాలు పెంచడానికి అధిక రేట్లలో కొన్న విద్యుత్‌కు, ప్రభుత్వం నుంచి రావాల్సిన సబ్సిడీలు రాబట్టకపోవడం వల్ల వచ్చే లోటుపాట్లకు, లీకేజీల వల్ల వచ్చే నష్టాలకు వినియోగదారులను ఇలా వేధించడం అన్యాయం అని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలను పెంచబోమని ఎన్నికల వేళ ఎన్‌డిఎ నాయకత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు వినతి పత్రాలను పంపించామని తెలిపారు.

ఆనకట్ట పనుల బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి -రోలుగుంట:గుండుబాడు ఆనకట్ట పనులు 2018లో చేయడం జరిగిందని, బిల్లులు నేటికి అందలేదని మండలంలో గుండుబాడు గ్రామానికి చెందిన మాజీ నీటి సంఘం అధ్యక్షులు బోరా పోతురాజు ఆవేదన వ్యక్తం చేశారు. 2018లో నీరు చెట్టు పథకంలో గుండుబాడు ఆనకట్టు పునరుద్ధీకరిం చుటకు 8లక్షల 15వేల 208ల నిధులు మంజూరు కాగా పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో ఆ బిల్లులు ఊసే ఎత్తలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి సంఘం అధ్యక్షులుగా పదవీ స్వీకారం చేసి నిర్మాణం పనులు చేపట్టి బిల్లులు రాకపోగా అప్పుల పాలై ఉన్న కొంత భూమిని అమ్మి అప్పులు తీర్చానని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వంలోనైనా బిల్లులు అందేలా చూడాలని కోరారు.

ప్రభుత్వ రంగ సంస్థల నాశనం దేశద్రోహ చర్య



దీక్షలో కూర్చున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పదేళ్లుగా దేశ ప్రజల ఆశయాలకు భిన్నంగా వ్యవహరిస్తోందని, ప్రభుత్వ రంగంలోని సంస్థలన్నింటినీ ప్రయివేటు వ్యక్తులకు ధారాదత్తంచేసి దేశద్రోహానికి పాల్పడుతుందని సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు విమర్శించారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక ప్రజా సంఘాల జెఎసి చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 1318వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో సిఐటియు జగదాంబ జోన్ నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎం.సుబ్బారావు మాట్లాడుతూ, 32 మంది బలిదానం, 61 మంది వామపక్ష పార్టీల నాయకులు పదవులకు రాజీనామాలు, త్యాగాల ఫలితంగా ఏర్పడిన స్టీల్‌ప్లాంట్‌ను ముట్టుకునే హక్కు బిజెపికి లేదన్నారు. ఇది ప్రజల, దేశ సొత్తు అన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకోవటమే నిజమైన దేశభక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.చంద్రశేఖర్, మురా కళాసీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.